

మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 287 | పేజీలు : 8 | వెల : రూ.2/- | మంగళవారం 10 నవంబర్ 2026 | వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

స్థానిక ఎన్నికల్లో కూటమి

ప్రభంజనం..

- 58.9 శాతం ఓట్లు!

మున్సిపల్ చైర్మన్ పదవుల్లో 94 శాతం విజయం..

659 జడ్పీటీసీలకు 575 స్థానాలు కైవసం

ప్రజాతీర్పు మా బాధ్యతను మరింత పెంచింది..

సుపరిపాలనకు ప్రజల ఆమోదం: ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి,మన జనప్రగతి నవంబర్ 09: ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సుపరిపాలన, మంచి రాజకీయాలపై తాను పెట్టుకున్న నమ్మకాన్ని ప్రజలు నిజం చేశారని పేర్కొన్నారు. 2024 సాధారణ ఎన్నికలతో పోలిస్తే స్థానిక ఎన్నికల్లో కూటమికి మరింత మెరుగైన ఫలితాలు వచ్చాయని వెల్లడించారు. కూటమి పాలన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు తమ ఓటు ద్వారా మద్దతు తెలిపారని చెప్పారు. మిగతా2లో...



చర్చలు, దౌత్యంతోనే
యుద్ధానికి పరిష్కారం

● జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ ● శాంతి ప్రయత్నాలకు భారత్ సంపూర్ణ మద్దతు ● మానవతా దృక్పథానికే ప్రాధాన్యమని స్పష్టీకరణ ● ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపైనా ఇరువురు నేతల చర్చ

న్యూఢిల్లీ,మన జనప్రగతి నవంబర్ 09: రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే శాంతియుత పరిష్కారం కనుగొనాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో ప్రధాని ఫోన్‌లో మాట్లాడారు. కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు, తాజా పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించారు. యుద్ధానికి శాంతియుత పరిష్కారం లభించేలా చేపట్టే అన్ని ప్రయత్నాలకు భారత్ తనవంతు సహకారం అందించేందుకు సిద్ధంగా మిగతా2లో...

వైవాహిక బంధానికి పవన్ కల్యాణ్
దంపతుల ముగింపు

● వైవాహిక బంధానికి పవన్ కల్యాణ్ అన్నా కొణిదెల ముగింపు!

● పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయం

● పిల్లల బాధ్యతలు కొనసాగిస్తాం.. వ్యక్తిగత గోప్యతను గౌరవించండి



అమరావతి,మన జనప్రగతి నవంబర్ 09: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్, ఆయన భార్య అన్నా కొణిదెల తమ వైవాహిక బంధానికి ముగింపు పలకాలని నిర్ణయించుకున్నారు. పరస్పర అవగాహన, గౌరవంతో విడిపోతున్నట్లు ఇద్దరూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు.జీవితంలో ఎంతోకాలం కలిసి ప్రయాణించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామని వారు వెల్లడించారు. భార్యాభర్తల బంధం ముగిసినప్పటికీ మంచి స్నేహితులుగా కొనసాగుతామని తెలిపారు. తమ పిల్లలకు అంకితమైన తల్లిదండ్రులుగా బాధ్యతలు నిర్వర్తిస్తామని, వారి సంతోషం, మిగతా2లో...

ఎన్నికల వేళ
ప్రజాస్వామ్యానికి తూట్లు!

- దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది: జగన్

- స్థానిక సంస్థల ఎన్నికలపై మాజీ మంత్రి పేర్ని నాని విమర్శలు



అమరావతి,మన జనప్రగతి నవంబర్ 09: ఏపీలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు టీడీపీ అరాచకానికి పరాకాష్టగా నిలిచాయని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య విమర్శించారు. ఇదే అంశంపై వైసీపీ అధినేత జగన్ కూడా ఎక్స్ వేదికగా స్పందించారు. ముఖ్యమంత్రి ప్రకటనలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని విమర్శించారు. సోమవారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర మిగతా2లో...

కొడంగల్‌కు కృష్ణా జలాలు తెస్తా!

● అడ్డొచ్చిన వారిని ఎదురించి ప్రాజెక్టు పూర్తి చేస్తా

● ప్రజల అండ ఉంటే మోదీనైనా.. కేడీనైనా ఎదిరిస్తా: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, మన జనప్రగతి నవంబర్ 09: ఎవరు అడ్డొచ్చినా ఎదురించి కొడంగల్‌కు కృష్ణా జలాలు తీసుకొస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కొడంగల్ భూముల్లో పచ్చని పంటలు పండించే బాధ్యత తనదని, పోలేపల్లి ఎల్లమ్మ తల్లిపై ప్రమాణం చేసి చెబుతున్నానని అన్నారు. ప్రజల అండ ఉంటే ఢిల్లీలో మోదీనైనా, కేడీనైనా ఎదిరిస్తానని పేర్కొన్నారు.వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేటలో సోమవారం ప్రభుత్వం నిర్వహించిన రైతు మేళాలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులతో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. కేసీఆర్ చేసిన అప్పులు, తప్పులకు ఈ 34 నెలల్లో రూ. 2 లక్షల కోట్లకు పైగా చెల్లించామని తెలిపారు.పాలమూరు ప్రాజెక్టులను పదేళ్లు పడావు పెట్టారు బూర్గుల మిగతా2లో...



గ్రామాల్లో కోడ్.. పట్టణాల్లో ఎత్తివేత

గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగనున్న ఎన్నికల ప్రవర్తనా నియమావళి

అమరావతి,మన జనప్రగతి నవంబర్ 09: ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని రాష్ట్ర ఎన్నికల సంఘం ఎత్తివేసింది. నవంబర్ 7వ తేదీ రాత్రి 10 గంటల నుంచి ఈ ఉత్తర్వులు అమల్లోకి వచ్చినట్లు

మిగతా2లో...

ప్రమాద పరిహారంలో బాధితులకు
హైకోర్టు ఊరట

- పరిహారాన్ని రూ.7.74 లక్షలకు పెంచిన హైకోర్టు



2లో

జనవరిలో ఐదు రాష్ట్రాల
ఎన్నికల నగారా!

యూపీ, పంజాబ్, గోవా, మణిపూర్, ఉత్తరాఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు



2లో

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక

10 - 11 - 2026

స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభంజనం..

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన స్థానిక ఎన్నికల ఫలితాలు, కూటమి విజయాలు, ప్రభుత్వ ప్రాధాన్యాలు, రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. **కూటమి ఓట్ల శాతం 58.9కు పెరుగుదల** 2024 ఎన్నికల్లో కూటమికి 55.3 శాతం ఓట్లు రాగా, వైసీపీకి 39 శాతం ఓట్లు వచ్చాయని చంద్రబాబు గుర్తుచేశారు. తాజా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఓట్ల శాతం 58.9కు పెరిగిందని, వైసీపీ ఓట్ల శాతం 33.56కు పడిపోయిందని తెలిపారు. గత ఎన్నికలతో పోలిస్తే వైసీపీకి 6.25 శాతం ఓట్లు తగ్గాయని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ పదవుల్లో కూటమి 94 శాతం విజయాల రేటు సాధించిందని వెల్లడించారు. ఈ ఫలితాలు ప్రజలు తమ పాలనపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. **పరిషత్ ఎన్నికల్లోనూ కూటమి ఘన విజయం** ఎంపీటీసీ స్థానాల్లో 90 శాతానికి పైగా కూటమి గెలుచుకుందని ముఖ్యమంత్రి తెలిపారు. మొత్తం 659 జడ్పీటీసీ స్థానాల్లో 575 స్థానాలను కూటమి కైవసం చేసుకుందని వెల్లడించారు. అల్లూరి జిల్లా మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో జడ్పీలను గెలుచుకున్నామని చెప్పారు. ఏడు జిల్లాల్లో వైసీపీ ఒక్క జడ్పీటీసీ స్థానాన్ని కూడా గెలవలేకపోయిందని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లోనూ కూటమికి 67 శాతం ఓట్లు వచ్చాయని వివరించారు. ఈవీఎంలపై ఆరోపణలు చేసిన వైసీపీ ఇప్పుడు బ్యాలెట్లపైనా ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. పోస్టల్ బ్యాలెట్‌లో వచ్చిన ఓట్లకు ఆ పార్టీ ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. **కూటమి పాలనకు ప్రజలు పట్టం కట్టారు** రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ ప్రజలు కూటమిని ఆదరించారని చంద్రబాబు అన్నారు. ఈ విజయం సంక్షేమం, అభివృద్ధి పాలనకు ప్రజలు ఇచ్చిన గౌరవమని అభివర్ణించారు. రెండున్నరేళ్లుగా రాష్ట్ర పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్రాన్ని కాపాడాలనే లక్ష్యంతోనే కూటమిగా ఏర్పడ్డామని, స్వర్ణాంధ్ర విజన్‌తో పాలన ప్రారంభించి స్పష్టమైన ప్రణాళిక రూపొందించామని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు దీర్ఘకాలిక లక్ష్యాలతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. **కరవును జయించడమే లక్ష్యం** రాష్ట్రంలో కరవు సమస్యను అధిగమించడం తమ ముందున్న ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాళ్లసీమగా పేరుపొందిన రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో 53 శాతం లోటు వర్షపాతం నమోదైనప్పటికీ ముందుచూపుతో నీటిని పొదుపుగా వినియోగించుకోగలిగామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకొస్తున్నామని, గోదావరికావేరి నదుల అనుసంధానం పూర్తయితే రాష్ట్రంలో కరవు సమస్యకు పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. **టీడీపీ అంటేనే కార్యకర్తల పార్టీ** తెలుగుదేశం పార్టీ కార్యకర్తల నిబద్ధత, సేవాభావంతో ముందుకు సాగుతుందని చంద్రబాబు అన్నారు. నాయకులు మారినా కార్యకర్తలు పార్టీ జెండాను వదలరని పేర్కొన్నారు. డబ్బుతో కాకుండా సేవాభావంతో రాజకీయాలు చేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో పాటు ఆర్మ్‌బ్, మురసు తుఫాన్లను ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కొందని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక అసమానతలను తగ్గించడమే తమ లక్ష్యమని చెప్పారు. ఏపీ బ్రాండ్‌ను తిరిగి పునరుద్ధరించామని, రాష్ట్రంలో గణనీయమైన మార్పులు తీసుకొచ్చామని అన్నారు. కేవలం కష్టపడటమే కాకుండా సాంకేతికతను ఉపయోగించుకుని తెలివిగా, సమర్థంగా పనిచేయాలని సూచించారు. **వైసీపీ కుట్రలు ఫలించలేదు** బీసీలకు రిజర్వేషన్లు కల్పించే ప్రయత్నాలను వైసీపీ అడ్డుకునేందుకు ప్రయత్నించిందని చంద్రబాబు విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకోవడానికి ఆ పార్టీ కుట్రలు చేసిందని ఆరోపించారు. గతంలో ఎన్నడూ లేనంత ప్రశాంతంగా స్థానిక ఎన్నికలు జరిగాయని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో వైసీపీ హింసకు పాల్పడిందని, నేరాలు, హింసాత్మక మార్గాలనే ఆ పార్టీ నమ్ముకుందని విమర్శించారు. 'రప్పా.. రప్పా' రాజకీయాలను ప్రజలు తిరస్కరించారని అన్నారు. ఎన్ని రాజకీయ డ్రామాలు చేసినా ప్రజలు ఇచ్చిన తీర్పును మార్చడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. **వైసీపీ కంటే కాంగ్రెస్‌కే ఎక్కువ ఓట్లు** ప్రజలు వైసీపీకి ఓటు వేయడానికి ఇష్టపడలేదని చంద్రబాబు అన్నారు. కొన్ని చోట్ల కూటమి అభ్యర్థులకు, మరికొన్ని చోట్ల తిరుగుబాటు అభ్యర్థులకు ఓటు వేశారని వివరించారు. చీరాలలో వైసీపీ కంటే కాంగ్రెస్ పార్టీకి ఎక్కువ ఓట్లు వచ్చాయని తెలిపారు. కడప జిల్లాలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగినా ఇలాంటి ఫలితాలే వస్తాయని వ్యాఖ్యానించారు. **ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం** స్థానిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు తమ బాధ్యతను మరింత పెంచిందని చంద్రబాబు అన్నారు. ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రజలు గుర్తించారని తెలిపారు. కూటమి విజయానికి కృషి చేసిన అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలియజేశారు. తమకు ఎలాంటి భేషజాలు లేవని, ఎక్కడైనా తప్పులు జరిగి ఉంటే వాటిని సరిదిద్దుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం మరింత బాధ్యతతో పనిచేస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ఎన్నికల వేళ ప్రజాస్వామ్యానికి తూట్లు!

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయంలో పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. నామినేషన్ల స్వీకరణతో మొదలైన అరాచకాలు డిక్లరేషన్ ఫారాలు ఇచ్చే వరకు కొనసాగాయని పేర్ని నాని ఆరోపించారు. ముఖ్యమంత్రి మీడియా సమావేశం చూస్తుంటే ఆవు తోలు కప్పుకున్న తోడేలు వంద అబద్ధాలు, యాభై నీతులు చెప్పినట్లుగా ఉందని విమర్శించారు. బయట ప్రవచనాలు చెబుతూ ఆశ్రమంలో ఆగడాలకు పాల్పడే నిత్యానంద స్వామిలా చంద్రబాబు ద్వంద్వ వైఖరి ఉందన్నారు. రాజ్యాంగబద్ధంగా పనిచేయాల్సిన రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని పక్షవాతం వచ్చిన రోగిలా మార్చేశారని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన పోలీసులే దుశ్శాసనుడిలా మారి వ్యవస్థను చెరబట్టారని ఆరోపించారు. టీడీపీ రౌడీలు, గుండాల బెదిరింపులతో రాష్ట్రంలోని 17 మున్సిపాలిటీల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు లేకుండా చేశారని తెలిపారు. చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరు కార్పొరేషన్‌లో 60 డివిజన్లకు గాను 51 చోట్ల ఫ్యాన్ గుర్తు లేకుండా దౌర్జన్యం చేశారని పేర్కొన్నారు. కడప కార్పొరేషన్‌లో 66 డివిజన్లకు గాను 51 స్థానాల్లో ప్రతిపక్ష అభ్యర్థులను బరిలో నిలవకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. వైసీపీ క్రియాశీలక కార్యకర్తలపై అక్రమంగా రౌడీషీట్లు తెరిచి, లక్షల రూపాయల పూచీకత్తుతో బైండోవర్ చేశారని పేర్ని నాని తెలిపారు. హత్యలకు పాల్పడిన టీడీపీ రౌడీలపై మాత్రం ఎక్కడా బైండోవర్ కేసులు లేవన్నారు. నామినేషన్ పత్రాలు లాక్కొని చింపేయడం, సంతకాలు ఫోర్జరీ చేసి దొంగ ఉపసంహరణలు చేయించడం ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. తాడికొండ, మంగళగిరిలో టీడీపీ ఓడిపోయినప్పుడు అమరావతిని ప్రజలు తిరస్కరించినట్లేనని చంద్రబాబు ఒప్పుకుంటారా అని ప్రశ్నించారు. గ్రామకంఠం భూముల పేరుతో రాజధాని ప్రాంత రైతులను చంద్రబాబు, నారాయణ వేధిస్తున్నారని ఆరోపించారు. అమరావతిలో చంద్రబాబు, నారాయణ ఇళ్లు తప్ప సామాన్య ప్రజలు ఇళ్లు నిర్మించుకున్న దాఖలాలు లేవని అన్నారు. ఆర్మ్‌బ్, మురసు తుపాన్లతో సర్వం కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నుంచి నయాపైసా సాయం అందలేదని పేర్ని నాని విమర్శించారు.

కొడంగల్‌కు కృష్ణా జలాలు తెస్తా!

(మొదటి పేజీ తరువాయి)

రామకృష్ణారావు నుంచి ఎంతోమంది ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించినా వలసలు ఆగలేదని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టులు పూర్తికాక, పొలాలకు నీళ్లు అందక ప్రజలు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేస్తారని ఆశించామని, కానీ పదేళ్లపాటు వాటిని నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. పాలమూరు ప్రజలు భుజాలపై మోసిన కేసీఆర్ చివరకు గజ్వేల్‌కు వెళ్లిపోయారని అన్నారు. **రూ.8.11 లక్షల కోట్ల అప్పులు** పదేళ్లలో కేసీఆర్ రూ.8.11 లక్షల కోట్ల అప్పులు చేసి ఫామ్‌హౌస్‌లో పడుకున్నారని సీఎం విమర్శించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను గుర్తించి 2024 జనవరి నుంచి ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు. అసెంబ్లీలో చర్చకు రావాలని పిలిచినా కేసీఆర్ రావడం లేదని, ఆయన తింటే కుంభకర్ణుడు.. పంటే బకాసురుడని వ్యాఖ్యానించారు. **డిసెంబర్ లోగా కృష్ణా జలాలు తీసుకొస్తా** మక్తల్- నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను తాము ప్రారంభిస్తే కేసీఆర్, కేటీఆర్ అడ్డుకుంటున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపడుతుంటే వారికి కడుపుమంట ఎందుకని ప్రశ్నించారు. డిసెంబర్ నాటికి కృష్ణా జలాలు తీసుకొచ్చి కొడంగల్ బీడు భూములను తడుపుతానని హామీ ఇచ్చారు. కొడంగల్‌ను విద్యా కేంద్రంగా అభివృద్ధి చేసి ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చేస్తామని చెప్పారు. **రూ.9 వేల కోట్లతో అభివృద్ధి పనులు** కొడంగల్ అభివృద్ధి జరుగుతుంటే కొందరు విమర్శలు చేస్తున్నారని సీఎం అన్నారు. ఈ ప్రాంతంలో రూ.9 వేల కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించుకున్నామని తెలిపారు. సంక్రాంతి తర్వాత ప్రజాబలం పేరుతో ప్రజల్లోకి వస్తామని చెప్పారు. అందరూ కలిసికట్టుగా ఎల్‌నినోను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ప్రజాబలంతో సునా మీ సృష్టిస్తామని, ఆ సునామీలో మోదీ, కేడీ కొట్టుకుపోతారని వ్యాఖ్యానించారు. జర్నలిస్టులు అధైర్యపడ వద్దని, వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత తనదేనని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

జనవరిలో ఐదు రాష్ట్రాల ఎన్నికల నగారా!

న్యూఢిల్లీ, మన జనప్రగతి నవంబర్ 09:
దేశంలోని ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను వచ్చే ఏడాది జనవరి మొదటి అర్ధభాగంలో ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా రాష్ట్రాల్లో 2027లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఎన్నికల సన్నద్ధతను పరిశీలించేందుకు ఎన్నికల సంఘం ఉన్నతాధికారుల బృందాలు ఆయా రాష్ట్రాల్లో పర్యటిస్తున్నాయి. పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్‌లో పర్యటనలు పూర్తయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లో ఒక పర్యటన పూర్తికాగా, మరో రెండు పర్యటనలు నిర్వహించాల్సి ఉంది. గోవాలో పర్యటన ఇంకా జరగాల్సి ఉంది. ఈ నెలాఖరులోగా అధికారుల పర్యటనలు పూర్తయ్యే అవకాశం ఉంది. ఆ తర్వాత ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఐదు రాష్ట్రాల్లో పర్యటించి ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమవుతారు. శాంతిభద్రతలు, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను సమీక్షిస్తారు. ఉత్తరప్రదేశ్‌లో అధిక నియోజకవర్గాలు ఉండటంతో పలు విడతల్లో పోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్‌లో ఒకే విడతలో ఎన్నికలు జరిగే అవకాశమున్నట్లు సమాచారం. అయితే ఎన్నికల తేదీలు, పోలింగ్ విడతలపై ఎన్నికల సంఘం ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు.

రాప్తాడు బాధిత విద్యార్థిని ఆరోగ్యం మరింత మెరుగు

- ఐసీయూ నుంచి సాధారణ వార్డుకు తరలింపు.. బాలికకు కొనసాగుతున్న చికిత్స



అమరావతి,మన జనప్రగతి నవంబర్ 09: అనంతపురం జిల్లా రాప్తాడులో దాడికి గురై తీవ్రంగా గాయపడిన విద్యార్థిని ఆరోగ్యం మరింత మెరుగుపడిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను చిన్నపిల్లల అత్యవసర చికిత్స విభాగం నుంచి సాధారణ వార్డుకు మార్చినట్లు వెల్లడించారు. అమరావతిలో సోమవారం మంత్రి మాట్లాడుతూ.. బాలిక గాయాలకు వైద్యులు మరోసారి కట్లు మార్చారని తెలిపారు. ఎడమ చేతికి వేసిన పట్టీని తొలగించడంతో ఆమె చేతిని కదిలించేందుకు సౌలభ్యం ఏర్పడిందన్నారు. అయితే బాలిక ఆహారం తక్కువగా తీసుకుంటుండటంతో ముక్కు ద్వారా గొట్టం సాయంతో ఆహారం అందిస్తున్నట్లు వివరించారు. నోటి ద్వారా ఆహారం తీసుకునేలా వైద్యులు ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. డాక్టర్ భాస్కర్ షెనాయ్ పర్యవేక్షణలో బాలికకు చికిత్స అందుతోందని మంత్రి తెలిపారు. ప్లాస్టిక్ శస్త్రచికిత్స, ఎముకల వైద్య నిపుణులు సమన్వయంతో వైద్యం అందిస్తున్నారని పేర్కొన్నారు. బాలిక ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని, త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

చర్చలు, దౌత్యంతోనే యుద్ధానికి పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

ఉందని మోదీ పునరుద్ఘాటించారు. **మానవతా దృక్పథానికే ప్రాధాన్యం** ప్రస్తుత సంక్షోభంలో భారత్ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తోందని మోదీ తెలిపారు. యుద్ధం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శాంతి స్థాపనకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. వివాదాన్ని పరిష్కరించుకోవడానికి చర్చలు, దౌత్యమే సరైన మార్గమని భారత్ మొదటి నుంచీ చెబుతోందని గుర్తుచేశారు. శాంతియుత పరిష్కారం కోసం జరిగే ప్రయత్నాల్లో భారత్ భాగస్వామ్యం కావడానికి సిద్ధంగా ఉందని జెలెన్‌స్కీకి తెలిపారు. **అబుధాబి సమావేశంపై జెలెన్‌స్కీ వివరణ** మోదీతో మాట్లాడిన విషయాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వెల్లడించారు. తాజా దౌత్య పరిణామాలు, అబుధాబిలో జరగనున్న సమావేశానికి ఉక్రెయిన్ చేస్తున్న సన్నాహాల గురించి ప్రధానికి వివరించినట్లు తెలిపారు. యుద్ధాన్ని ముగించేందుకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉందని, రష్యా కూడా ఉద్రిక్తతలను తగ్గించేందుకు ముందుకు రావాలని అన్నారు. ఇది యుద్ధాన్ని కొనసాగించే సమయం కాదని, ముగించాల్సిన సమయమని మోదీ పలుమార్లు స్పష్టం చేసినట్లు జెలెన్‌స్కీ గుర్తుచేశారు. **ధాన్యం రవాణాకు భారత్ సహకారం కోరిన జెలెన్‌స్కీ** నల్ల సముద్రం మీదుగా ధాన్యం ఎగుమతులకు ఆటంకాలు ఏర్పడుతున్న అంశాన్ని కూడా జెలెన్‌స్కీ ప్రస్తావించారు. ఆహార భద్రతకు విఘాతం కలగకుండా ధాన్యం రవాణా కోసం ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉందని, న్యూఢిల్లీ తన ప్రయత్నాలను కొనసాగిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం ఎగుమతులకు ఆటంకాలు తొలగించడం ద్వారా ప్రపంచ ఆహార భద్రతకు తోడ్పడవచ్చని అభిప్రాయపడ్డారు. **ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చ** భారత్-ఉక్రెయిన్ మధ్య వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునే అంశాలపై కూడా మోదీ, జెలెన్‌స్కీ చర్చించారు. ఇరు దేశాల ప్రజల పరస్పర ప్రయోజనాల కోసం సహకారాన్ని విస్తరించుకోవాలని నిర్ణయించారు. యుద్ధ పరిస్థితో పాటు శాంతి స్థాపన, మానవతా అంశాలపై భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది.

వైవాహిక బంధానికి పవన్ కల్యాణ్ దంపతుల ముగింపు

(మొదటి పేజీ తరువాయి)

సంక్షేమమే తమ ఉమ్మడి ప్రాధాన్యమని పేర్కొన్నారు. ఈ వ్యక్తిగత మార్పును అర్థం చేసుకుని, తమ గోప్యతను గౌరవించాలని ప్రజలు, అభిమానులు, శ్రేయోభిలాషులను కోరారు. ఇంతకాలం తమకు అండగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. విడిపోవడానికి గల కారణాలను మాత్రం సంయుక్త ప్రకటనలో వెల్లడించలేదు. పవన్ కల్యాణ్, అన్నా 2013 సెప్టెంబర్ 30న వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గ్రామాల్లో కోడ్.. పట్టణాల్లో ఎత్తివేత

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటించారు. రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తికావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. తుపాను కారణంగా వాయిదా పడిన చీరాల మున్సిపాలిటీ ఓట్ల లెక్కింపు కూడా ఈ నెల 6న పూర్తయింది. దీంతో మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థల్లో మేయర్, ఛైర్‌పర్సన్, వార్డు సభ్యుల ఎన్నికల ప్రక్రియ ముగిసింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల కోడ్ కొనసాగుతుందని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయినప్పటికీ, గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ఇంకా ముగియకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుందని వెల్లడించింది.

ప్రమాద పరిహారంలో బాధితులకు హైకోర్టు ఊరట

అమరావతి, మన జనప్రగతి నవంబర్ 09:
మోటారు వాహన ప్రమాద పరిహారం లెక్కించేటప్పుడు మరణించిన వ్యక్తి స్థిర వేతనంతో పాటు భవిష్యత్తు ఆదాయ అవకాశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. పరిహారం ఖరారు చేసేటప్పుడు మరణించిన వ్యక్తి వయసు ఆధారంగానే గుణకాన్ని నిర్ణయించాలని, తల్లి వయసును ప్రాతిపదికగా తీసుకోవడం సరికాదని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఆలపాటి గిరిధర్ తీర్పు వెలువరించారు. అనంతపురం జిల్లాకు చెందిన 21 ఏళ్ల ఉయ్యాల నాగమునిరెడ్డి 2009 జనవరి 2న తండ్రితో కలిసి పొలానికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. హైదరాబాద్‌లోని జి4 సెక్యూరిటీ సర్వీసెస్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ఆయనకు నెలకు రూ.4,238 వేతనం వచ్చేది. కుటుంబ సభ్యులు రూ.6 లక్షల పరిహారం కోరగా, ట్రిబ్యునల్ రూ.3,85,420 మాత్రమే మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని పెంచాలని కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. భవిష్యత్తు ఆదాయ అవకాశాలను పరిగణనలోకి తీసుకోకపోవడం, పరిహారం లెక్కింపులో జరిగిన తప్పిదాలను గుర్తించిన హైకోర్టు.. పరిహారాన్ని రూ.7.74 లక్షలకు పెంచుతూ తీర్పునిచ్చింది. సుప్రీంకోర్టు ప్రణయ్ సేథీ కేసు తీర్పు ప్రకారం స్థిర వేతనంపై 40 శాతం భవిష్యత్తు ఆదాయ పెంపును వర్తింపజేయాలని స్పష్టం చేసింది.

నేటి నుంచి మానవ హక్కుల కమిషన్ క్యాంపు కోర్టులు

● ఈ నెల 13 వరకు విజయవాడలో కేసుల విచారణ ● నాలుగు జిల్లాల కేసుల స్వీకరణకు ఏర్పాట్లు

అమరావతి, మన జనప్రగతి నవంబర్ 09: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో నవంబర్ 10 నుంచి 13వ తేదీ వరకు విజయవాడలో క్యాంపు కోర్టులు నిర్వహించనున్నారు. విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఎం. సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు సంబంధించిన పెండింగ్ కేసుల విచారణ చేపట్టడంతో పాటు కొత్త కేసులను కూడా స్వీకరించనున్నట్లు క్యాంపు కోర్టు నోడల్ అధికారి బొగ్గరం తారక నరసింహకుమార్ తెలిపారు. సంబంధిత జిల్లాల అధికారులు పెండింగ్ కేసుల విచారణకు హాజరుకావాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దీపావళి పాగతో క్షీణించిన గాలి నాణ్యత!

● విజయవాడలో 112 డెసిబుల్స్‌కు చేరిన శబ్ద తీవ్రత.. ఢిల్లీలో 400కు ఎక్యూఐ



అమరావతి, మన జనప్రగతి నవంబర్ 09: దీపావళి సందర్భంగా బాణసంచా కాల్చడంతో ఆంధ్రప్రదేశ్‌లో వాయు, శబ్ద కాలుష్యం పెరిగింది. విశాఖపట్నం, రాజమహేంద్రవరం నగరాల్లో గాలి నాణ్యత క్షీణించింది. రాష్ట్రంలోని 15 ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచీ (ఎక్యూఐ) 101 నుంచి 200 మధ్య నమోదైంది. విశాఖపట్నంలో గరిష్ఠ శబ్ద తీవ్రత 111 డెసిబుల్స్‌కు చేరగా, విజయవాడలో 112 డెసిబుల్స్ నమోదైంది. తిరుపతిలో అత్యధికంగా 191 ఎక్యూఐ నమోదైంది. నెల్లూరులో 175, శ్రీకాకుళంలో 170, ఏలూరులో 118గా నమోదయ్యాయి. అమరావతి, విజయవాడ, గుంటూరు, అనంతపురం ప్రాంతాల్లోనూ గాలి నాణ్యత ఒక్కసారిగా పడిపోయింది. దేశ రాజధాని ఢిల్లీలో ఎక్యూఐ 400కు చేరడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఉత్తరప్రదేశ్‌లోని లోనీలోనూ గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి పడిపోయింది. పీఎం2.5, పీఎం10 ధూళి కణాల స్థాయిలు అధికంగా నమోదయ్యాయి. ఎక్యూఐ 101 నుంచి 200 మధ్య ఉంటే ఆస్తమా, ఊపిరితిత్తులు, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారికి శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. కాలుష్యాన్ని పర్యవేక్షించేందుకు రాష్ట్రవ్యాప్తంగా గాలి నాణ్యత, శబ్ద తీవ్రత కొలిచే కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది. విశాఖలో కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపింది.

మహిళా డిగ్రీ కళాశాలలో ముగిసిన 'అలంకరణ చేపల పెంపకం' శిక్షణ కార్యక్రమం

- ఉపాధి అవకాశాలకు చక్కటి మార్గం: ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు
- విద్యార్థినులకు సర్టిఫికెట్ల ప్రదానం



పులివెందుల అర్బన్ మన జనప్రగతి నవంబర్ 09:స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జువాలజీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'అలంకరణ చేపలు అక్వేరియం తయారీ' సర్టిఫికెట్ కోర్సు ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది.కళాశాల వైస్ ప్రిన్సిపల్,జువాలజీ విభాగాధిపతి డాక్టర్ యు.శ్రీనిత పర్యవేక్షణలో విద్యార్థినులకు ఈ ప్రత్యేక శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థినులకు చదువుతో పాటు స్వయం ఉపాధి కల్పించే ఇలాంటి నైపుణ్యాధారిత కోర్సులపై అవగాహన కల్పించడం ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు.డాక్టర్ యు.శ్రీనిత మాట్లాడుతూ అక్వేరియం చేపల పెంపకంలో స్వచ్ఛమైన నీరు, సరైన ఆహారం,నిరంతర ఆక్సిజన్ మరియు అనుకూల వాతావరణం కల్పించడం అత్యంత కీలకమని వివరించారు.ఈ నిర్వహణ ద్వారా జీవవైవిధ్యం, జలచరాల సంరక్షణపై విద్యార్థినుల్లో ఆసక్తి పెరుగుతుందని ఆమె తెలిపారు.శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులు మాట్లాడుతూ. గోల్డ్ ఫిష్,గప్పీ,మోలీ, ఏంజెల్ ఫిష్ వంటి వివిధ రకాల రంగురంగుల అలంకరణ చేపల జీవన విధానం,వాటి ఆహారపు అలవాట్లు,ఆవాస పరిస్థితులపై సమగ్ర అవగాహన వచ్చిందన్నారు. అక్వేరియం చేపల పెంపకం కేవలం అభిరుచిగానే కాకుండా భవిష్యత్తులో మంచి ఉపాధి మార్గంగా ఉపయోగపడుతుందని తమ అనుభవాలను పంచుకున్నారు.అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు ధ్రువపత్రాలను (సర్టిఫికెట్లు) అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వినోద, ప్రవళికతో పాటు పలువురు విద్యార్థినులు పాల్గొన్నారు.

సప్లయర్స్ షాపులో అగ్నిప్రమాదం.. రూ. 7 లక్షల ఆస్తి నష్టం.!





పులివెందుల అర్బన్ మన జనప్రగతి నవంబర్ 09:పులివెందుల పట్టణంలో సోమవారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ముద్దునూరు రోడ్డులోని సీఎస్ఐ చర్చి సమీపంలో ఉన్న గంగాభవాని సప్లయర్స్ షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో సుమారు రూ.7 లక్షల విలువైన ఆస్తి నష్టం వాటిల్లింది.స్థానికులు,బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం తొండూరు మండలం మడూరు గ్రామానికి చెందిన మహేష్ అనే వ్యక్తి పులివెందులలో 'గంగాభవాని సప్లయర్స్' పేరుతో దుకాణాన్ని నడుపుతున్నాడు. వివాహాలు,విందులు, శుభకార్యాలకు అవసరమైన సామగ్రి,శ్యామియానాలు అద్దెకు ఇస్తూ జీవనం సాగిస్తున్నాడు.కాగా, సోమవారం అర్ధరాత్రి దుకాణంలో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి.షాపు నుంచి పొగలు, మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు.ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే దుకాణంలో ఉన్న వంట సామాగ్రి,విలువైన ఫర్నిచర్, శ్యామియానాలు పూర్తిగా దగ్ధమయ్యాయి.ఈ ప్రమాదంలో సుమారు రూ.7 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు మహేష్ ఆవేదన వ్యక్తం చేశాడు.ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరుతున్నాడు.

కడపలో అందుబాటులోకి లైఫ్‌లైన్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి

- అత్యాధునిక వైద్య సేవలతో ప్రారంభం
- పేదలకు రాయితీతో వైద్యం



కడప మన జనప్రగతి నవంబర్ 09:-కడప నగరంలోని సెవెన్ రోడ్స్ సర్కిల్ సమీపంలో ఏర్పాటు చేసిన లైఫ్‌లైన్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఆసుపత్రిలోని వివిధ వైద్య విభాగాలను రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల సలహాదారు ఎం.ఏ. షరీఫ్, టీడీపీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కడపలో ఆధునిక వైద్య సదుపాయాలతో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. అత్యవసర వైద్యం కోసం జిల్లా ప్రజలు ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే మెరుగైన వైద్యం పొందవచ్చని తెలిపారు.ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్‌తో పాటు కార్డియాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ తదితర విభాగాల ద్వారా వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. పేదలకు సహారా కార్డు ద్వారా ఆసుపత్రి ఫీజుల్లో రాయితీ కల్పించనున్నట్లు తెలిపారు.అనంతరం ఆసుపత్రి ఎండీ డాక్టర్ రబ్బాని మాట్లాడుతూ.. తన తండ్రి జిలానీ భాష అనారోగ్యానికి గురైన సమయంలో సరైన వైద్య సదుపాయాలు లేక హైదరాబాద్‌కు వెళ్లాల్సి వచ్చిందని గుర్తు చేసుకున్నారు. జిల్లా ప్రజలకు అలాంటి ఇబ్బందులు ఎదురుకాకూడదనే ఉద్దేశంతో అన్ని రకాల వైద్య సదుపాయాలను ఒకే చోట అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోవర్ధన్ రెడ్డి, అమీర్ బాబు, అలంకానిపల్లి లక్ష్మిరెడ్డి, జనసేన జిల్లా ఇన్‌చార్జి సుంకర శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు తులసిరెడ్డి, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

జనగణన 2027ను పకడ్బందీగా నిర్వహించాలి

- ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి



కర్నూలు బ్యూరో మన జనప్రగతి నవంబర్ 09:- జనగణన2027 ప్రక్రియను పకడ్బందీగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులకు సూచించారు. జనగణన విధుల్లో పాల్గొనే ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని తెలిపారు.సోమవారం బృందావన్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా, మున్సిపల్ కార్పొరేషన్, ఛార్జ్ స్థాయి జనగణన అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణను అధికారులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవడంతో పాటు సందేహాలను మాస్టర్ ట్రైనర్ల ద్వారా నివృత్తి చేసుకోవాలని తెలిపారు.జనగణనలో భాగంగా చేపట్టనున్న స్వీయ గణనపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. స్వీయ గణన చేసుకున్న వారు తమకు కేటాయించిన గుర్తింపు సంఖ్యను కుటుంబ సభ్యులకు తప్పనిసరిగా తెలియజేయాలని సూచించారు. ముఖ్యంగా ఇతర ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు, ఉద్యోగులు స్వీయ గణన పూర్తిచేసిన అనంతరం ఆ వివరాలను ఇంట్లో వారికి అందించాలని తెలిపారు. తద్వారా క్షేత్రస్థాయిలో ఎన్యూమరేటర్లకు ఇబ్బందులు లేకుండా జనగణన ప్రక్రియ సులభతరం అవుతుందని పేర్కొన్నారు.స్వీయ గణన విధానం, ప్రయోజనాలపై పత్రికా ప్రకటనలతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, పత్తికొండ ఆర్డీవో ఓబులేసు, ఆదోని ఆర్డీవో అరుణ దేవి, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, జిల్లా జనగణన ఇన్‌చార్జ్ ఎన్. దీపక్ భరద్వాజ్, తహశీల్దార్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం అందరికీ అందుబాటులో ఉండాలి

- ధనిక, పేద తేడా లేకుండా ఉచిత న్యాయ సేవలు
- ఘనంగా జాతీయ న్యాయ సేవల దినోత్సవం



పత్తికొండ, మన జనప్రగతి, నవంబర్ 09:ధనిక, పేద అనే తేడా లేకుండా సమాజంలోని ప్రతి ఒక్కరికీ న్యాయ సేవలు అందించడమే న్యాయవ్యవస్థ ప్రధాన లక్ష్యమని సీనియర్ న్యాయవాది ఎల్లారెడ్డి, ప్యానెల్ న్యాయవాదులు నగేష్, సూరజ్ నబి, శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్కరూ న్యాయానికి దూరం కాకూడదని అన్నారు.సోమవారం కర్నూలు జిల్లా పత్తికొండలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ సమాజంలోని వెనుకబడిన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు భారత ప్రభుత్వం 1987లో న్యాయ సేవాధికార సంస్థల చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఈ చట్టం 1995 నవంబర్ 9 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిందని, అందుకే ఏటా నవంబర్ 9న జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి న్యాయ సేవాధికార సంస్థల ద్వారా అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. న్యాయ సేవలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఈ సందర్భంగా న్యాయవాదులు అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పంపాపతి, రంగస్వామి, నెట్టే కళ్ళు, హరికృష్ణ చారి, రవికుమార్, రామాంజనేయులు, లోక్ అదాలత్ క్లర్క్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ ఉచిత న్యాయ సేవలు అందించడమే లక్ష్యం

- న్యాయం ప్రతిఒక్కరి హక్కు
- ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ గోపాల్







కడప, మన జనప్రగతి, నవంబర్ 09:- ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సహాయం అందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన లక్ష్యమని కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ గోపాల్ పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల మేరకు కడపలో న్యాయ విజ్ఞాన సదస్సు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. న్యాయం ప్రతి ఒక్కరి హక్కు అని, ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించడం, ఉచిత న్యాయ సహాయం అందించడం, వివాదాలను రాజీ మార్గంలో పరిష్కరించడం ద్వారా సత్వర న్యాయం అందించడమే న్యాయ సేవాధికార సంస్థ ఉద్దేశ్యమని తెలిపారు. పేదలు, మహిళలు, పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు, బలహీన వర్గాలకు ఉచిత న్యాయవాది సేవలు, న్యాయ సలహాలు, అవసరమైన సహాయం అందిస్తున్నట్లు వివరించారు.లోక్ అదాలత్‌లు, మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని, దీనివల్ల సమయం, ధనం ఆదా అవుతాయని పేర్కొన్నారు. ప్రజలందరూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సేవలు, న్యాయ సలహాలు, ఇతర సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యాయం అందరికీ చేరువ చేయాలనే లక్ష్యంతో సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.అనంతరం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్, ప్యానెల్ లాయర్లు, మీడియేటర్లు, పారా లీగల్ వాలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు.**భారీగా అవగాహన ర్యాలీ** జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా ప్రజల్లో న్యాయ సేవలపై అవగాహన కల్పించేందుకు జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి కోటిరెడ్డి సర్కిల్, సంధ్యా సర్కిల్, రాజీవ్ మార్గ్, కలెక్టర్ సుబ్రహ్మణ్యం సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ మీదుగా తిరిగి జిల్లా కోర్టు ప్రాంగణం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కడప యూనిట్ న్యాయమూర్తులు, న్యాయవాదులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్, మీడియేటర్లు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, న్యాయ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఉచిత న్యాయ సహాయం, న్యాయ హక్కులు, సత్వర న్యాయం ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సేవలు, సహాయం కోసం 15100 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి-కమ్-సీనియర్ సివిల్ జడ్జి ఎన్. బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బాల బ్రహ్మేశ్వర ఆలయం వద్ద సీసీ రోడ్డు పనుల తనిఖీ



సిద్ధవటం మన జనప్రగతి సెప్టెంబర్ 09:-మండల కేంద్రమైన సిద్ధవటంలోని బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జిల్లా పరిషత్ సాధారణ నిధులు రూ. 4 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ఎంపీడీవో ఫణి రాజకుమారి తనిఖీ చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉండేలా చేపట్టిన రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు, మాజీ సర్పంచ్ ఓబులయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ హరి, ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేటినుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ వారి క్యాంపు కోర్టులు ప్రారంభం

కర్నూలు బ్యూరో మన జనప్రగతి నవంబర్ 09:-ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న క్యాంపు కోర్టు నిర్వహణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ గౌరవ చైర్మన్ జస్టిస్ ఎం. సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ నుండి 13వ తేదీ వరకు విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో హెచ్ఆర్సీ క్యాంపు కోర్టు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు క్యాంప్ కోర్టు నోడల్ అధికారి బొగ్గరం తారక నరసింహ కుమార్ తెలిపారు. ఈ క్యాంపు కోర్టులో ఎన్టీఆర్ జిల్లా కృష్ణాజిల్లా ఏలూరు జిల్లా,(భీమవరం) పశ్చిమగోదావరి జిల్లా లకు సంబంధించిన కేసుల విచారణలతో పాటు నూతన కేసుల స్వీకరణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని కోరారు ఈ క్యాంపు కోర్టు కార్యక్రమాల్లో హెచ్ఆర్సీ పరిధిలోని పెండింగ్ లో ఉన్న కేసులలోని ఆయా జిల్లాల అధికారులు విజయవాడ కేంద్రంగా నిర్వహించబడే ఈ క్యాంపు కోర్టుకి హాజరుకావాలని సూచించారు.

మురసు తుఫానుతో 1,302 కి.మీ. మేర దెబ్బతిన్న ఆర్ అండ్ బీ రహదారులు - పునరుద్ధరణకు రూ.870.90 కోట్లు అవసరం: మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



అమరావతి, మన జనప్రగతి, నవంబర్ 09:- మురసు తీవ్ర తుఫాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్ బీ శాఖ పరిధిలోని 1,302 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు.అత్యధికంగా బాపట్ల జిల్లాలో 332 కి.మీ., గుంటూరులో 266 కి.మీ., ఎన్టీఆర్ జిల్లాలో 202 కి.మీ. మేర రహదారులు దెబ్బతిన్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రహదారుల కోతలు, వంతెనలు, సీడీ వర్క్స్ దెబ్బతినడం, చెట్లు పడిపోవడం వంటి సమస్యలు తలెత్తగా, అత్యధిక ప్రాంతాల్లో తాత్కాలిక పునరుద్ధరణ పనులు పూర్తిచేసినట్లు తెలిపారు. 207 చోట్ల పడిపోయిన చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించామన్నారు.దెబ్బతిన్న రహదారుల తాత్కాలిక పునరుద్ధరణకు రూ.98.70 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ.772.22 కోట్లు అవసరమవుతాయని ప్రాథమికంగా అంచనా వేసినట్లు మంత్రి పేర్కొన్నారు. మొత్తం రూ.870.90 కోట్లతో రహదారుల పునరుద్ధరణ చేపట్టాల్సి ఉందని వెల్లడించారు.

కబర్దీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



సిద్ధవటం మన జనప్రగతి సెప్టెంబర్ 09:-మండలంలోని లంకమల అటవీ ప్రాంతంలో వెలసిన కబర్దీశ్వర స్వామి ఆలయంలో సోమవారం వేకువజామున ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ పూజారి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో సిద్ధవటం, అట్లూరు, బద్వేల్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్తీక మాసం మూడో సోమవారం ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు పూజారి ఈశ్వరయ్య తెలిపారు. ఆలయ అభివృద్ధికి రాజంపేట జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ సహకరిస్తున్నారని మాజీ సర్పంచ్ ఓబులయ్య పేర్కొన్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఆయన తల్లిదండ్రులు కీర్తిశేషులు అతికారి వెంకటసుబ్బయ్య, రోషమ్మ జ్ఞాపకార్థం సుమారు 2,000 మందికి ఉచిత అన్నప్రసాదం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శంకరయ్య, ఈశ్వరయ్య, అతికారి చిన్న వెంకటయ్య, నాగభూషణం, భక్తులు పాల్గొన్నారు.

నిత్యపూజేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు



సిద్ధవటం మన జనప్రగతి సెప్టెంబర్ 09:-మండలంలోని వంతాటిపల్లె గ్రామ సమీపాన లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజేశ్వర స్వామి ఆలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పంచలింగాల గుడి సమీపంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులకు కడప నగరానికి చెందిన కీర్తిశేషులు కదిరి శ్రీనివాసులు కుటుంబ సభ్యులు అల్పాహారం, మధ్యాహ్నం అన్నప్రసాదాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా కదిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తమ కుటుంబం గత 65 ఏళ్లుగా కార్తీక మాసం, మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు అన్నప్రసాదాలు అందజేస్తోందన్నారు. కార్తీక మాసంలో నాలుగు వారాల పాటు భక్తులకు ఉచితంగా అన్నప్రసాద వితరణ కొనసాగిస్తామని తెలిపారు. నిత్యపూజేశ్వర స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు.

విద్యార్థి సమగ్రాభివృద్ధికి తల్లిదండ్రుల సమన్వయం అవసరం



చిట్వేలి మన జనప్రగతి నవంబర్ 09:-విద్యార్థుల విద్యా ప్రగతితో పాటు మానసిక ఆరోగ్యం, వ్యక్తిగత భద్రత, వ్యక్తిత్వ వికాసం, భవిష్యత్తు కెరీర్ లక్ష్యాల సాధనకు పాఠశాల,కౌన్సిలర్, తల్లిదండ్రుల సమన్వయం ఎంతో అవసరమని జిల్లా కెరీర్,మానసిక ఆరోగ్య కౌన్సిలర్ డక్కిలి సుబ్రమణ్యం తెలిపారు.సమగ్ర శిక్ష, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో అందిస్తున్న కెరీర్ మరియు మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్ సేవలను చిట్వేలి మండలంలోని ప్రతి విద్యార్థికి చేరువ చేయడమే లక్ష్యమని అన్నారు. విద్యార్థులలో పరీక్షల ఒత్తిడి, భయం,ఆందోళన,నిరాశ, ప్రవర్తనా మార్పులు,చదువుపై ఆసక్తి తగ్గడం, హాజరు లోపం వంటి సమస్యలను గుర్తించి తగిన కౌన్సెలింగ్ అందించడంతో పాటు ఉన్నత విద్య, కోర్సులు,ప్రవేశ పరీక్షలు, వృత్తి విద్య, ఉపాధి అవకాశాలపై కెరీర్ మార్గదర్శనం కల్పిస్తామని తెలిపారు. బాలల వ్యక్తిగత భద్రత, మంచి స్పర్శ, చెడు స్పర్శ, సైబర్ వేధింపులు, మొబైల్ వినియోగం, ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్, డిజిటల్ వ్యసనాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, భావోద్వేగ నియంత్రణ, నిర్ణయ సామర్థ్యం, జీవన నైపుణ్యాల అభివృద్ధికి కృషి చేస్తామని వివరించారు. విద్యార్థుల సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన మార్గదర్శనం అందించడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని, పిల్లల భావాలను అర్థం చేసుకుంటూ వారితో స్నేహపూర్వకంగా మెలగాలని కోరారు. విద్యార్థులు తమ సందేహాలు, సమస్యలను భయపడకుండా కౌన్సిలర్‌తో పంచుకోవాలని సూచించారు. కౌన్సెలింగ్ అనేది సమస్యలున్న విద్యార్థులకే కాకుండా ప్రతి విద్యార్థి సామర్థ్యాలను గుర్తించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి ఉపయోగపడే సేవ అని అన్నారు. పాఠశాల, కౌన్సిలర్, తల్లిదండ్రుల సమన్వయంతో విద్యార్థుల సమగ్రాభివృద్ధితోపాటు పాఠశాల విద్యా ప్రమాణాలు, ఫలితాలు, సానుకూల వాతావరణం మెరుగుపడతాయని తెలిపారు. చిట్వేల్ మండల ప్రజలు, తల్లిదండ్రులు, విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ముఖాముఖి లక్ష్యం

- ప్రజల వినతులపై అధికారులకు ఆదేశాలు జారీ: మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్



ప్రొద్దుటూరు మన జనప్రగతి నవంబర్ 09:-ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యం గా ప్రతి సోమ వారం కమిషనర్‌తో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సి పల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు.సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. వైఎంఆర్ కాలనీలోని రాజరాజేశ్వరి దేవాలయం వద్ద రహదారుల నిర్మాణం చేపట్టి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, బ్యాంక్ వీధిలో తాగునీటి సరఫరా మెరుగుపరిచేందుకు కొత్త పైపులైన్ వేయాలని ప్రజలు కోరారు.అలాగే అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలోని మహిళల వ్యాయామశాలలో పాడైన పరికరాలకు మరమ్మతులు చేయించాలని, ఎర్రగుంట్ల రోడ్డులోని వాసవి సర్కిల్ వద్ద మురుగునీటి కాలువలు నిర్మించి వర్షపు నీటి సమస్యకు పరిష్కారం చూపాలని వినతులు అందజేశారు.ప్రజల వినతులను పరిశీలించిన కమిషనర్ సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ కృష్ణ సింగ్, మున్సిపల్ ఇంజనీర్ ఎం. రాజేష్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు యశోద తదితరులు పాల్గొన్నారు.

సుగవాసి ప్రసాద్ బాబుకు టీడీపీ నాయకుల శుభాకాంక్షలు



సిద్ధవటం మన జనప్రగతి నవంబర్ 09:-జెడ్పీటీసీ ఎన్నికల ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో సంచలన విజయం సాధించిన రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబును సిద్ధవటం మండలం పెద్దపల్లి గ్రామపంచాయతీ భాకరాపేటకు చెందిన టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు చేసిన సమష్టి కృషి అభినందనీయమన్నారు. సుగవాసి ప్రసాద్ బాబు విజయం రాజంపేట పార్లమెంట్ పరిధిలో టీడీపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని, పార్టీకి మరింత బలాన్ని తీసుకొచ్చిందన్నారు. భవిష్యత్తులో ప్రజాసేవ, పార్టీ అభివృద్ధికి ఆయన నాయకత్వం మరింత దోహదపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య, రాజంపేట టీడీపీ అధికార ప్రతినిధి కడితం రామమోహన్ నాయుడు, సిద్ధవటం మండల తెలుగు యువత అధ్యక్షుడు పుత్తా సుధీర్ రాయల్, టీడీపీ మాజీ యూనిట్ ఇన్‌చార్జి పుత్తా శివానంద, గంగల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో పాలాలకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేస్తాం



చిట్వేలి మన జనప్రగతి నవంబర్ 09:-సామాజిక శంఖారావం కార్యక్రమంలో భాగంగా చిట్వేలి మండలం మైలపల్లి పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి దళితవాడ లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు.ఈ క్రమంలో సోమవారం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నిఖిల్, గ్రామ రెవెన్యూ అధికారి ఉదయ్ కుమార్ గొల్లపల్లి దళితవాడ ను సందర్శించి శ్మశాన స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.గ్రామంలో దళితవాడ ప్రజలకు శ్మశాన స్థలానికి సంబంధించిన సమస్యలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకునే దిశగా స్థల పరిస్థితులను పరిశీలించారు. అలాగే గ్రామ పరిధిలోని రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు సరైన దారి లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కూడా అధికారులు పరిశీలించారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పొలాలకు వెళ్లేందుకు అవసరమైన దారి ఏర్పాటు చేసే పనులను త్వరితగతిన ప్రారంభిస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కారం చూపించడమే సామాజిక శంఖారావం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని అధికారులు తెలిపారు. తమ సమస్యలను అధికారులు స్వయంగా పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంపై గొల్లపల్లి దళితవాడ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కడప మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీదే నైతిక విజయం: మాజీ డిప్యూటీ సీఎం అంజాద్బాషా



కడప మన జనప్రగతి నవంబర్ 09:-కడప నగర మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నైతిక విజయం సాధించిందని మాజీ డిప్యూటీ సీఎం, కడప నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.బి. అంజాద్ భాషా అన్నారు. నామినేషన్ కేంద్రం వద్ద రాళ్ల దాడి ఘటనలో రిమాండ్లో ఉన్న వైసీపీ కార్యకర్తలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా సీఈసీ సభ్యులు కే.సురేష్ బాబు,ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి ఆయన వెంట ఉ న్నారు.ఈ సందర్భంగా అంజాద్ భాషా మాట్లాడుతూ, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి రిమాండ్కు తరలించడం కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. పోలీసులే అధికార పార్టీకి రక్షణగా నిలిచారని, పోలింగ్ రోజున వైసీపీ బూత్ ఏజెంట్లను అడ్డుకున్నారని ఆరోపించారు.జరగని ఘటనలకు 307 వంటి కేసులు పెట్టారని, మొదట 20 మంది, తర్వాత మరో 20 మంది, సూత్రధారులంటూ మరో 16 మంది పై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నిదౌర్జన్యాలు, అక్రమ కేసులు ఎదుర్కొని కూడా వైసీపీకి చెందిన ఇద్దరు అభ్యర్థులు గెలవడం ప్రజల్లో పార్టీకి ఉన్న ఆదరణకు నిదర్శనమన్నారు. లక్ష ఓట్ల ఆధిక్యం అంటూ ప్రచారం చేసుకుంటున్న కూటమికి వాస్తవ మద్దతు ఎంతనేది ఫలితాలే చెబుతున్నాయన్నారు.కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అక్రమ కేసులు, దాడులకు పాల్పడిన వారిని చట్టపరంగా వదిలేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యానాదయ్య, శ్రీరంజన్ రెడ్డి, దాసరి శివప్రసాద్, రమేష్ రెడ్డి, షిండే రవిచంద్రరావు, మాస్టర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసం సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



ప్రొద్దుటూరు మన జనప్రగతి నవంబర్ 09:-కార్తీక మాసం సందర్భంగా ప్రతి సోమవారం ప్రొద్దుటూరు నుండి రాష్ట్రంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ గంగాధర్ వెల్లడించారు ఈ సందర్భంగా ప్రతి సోమవారం పొద్దుటూరు నుండి పొలతల క్షేత్రానికి కన్యతీర్థం క్షేత్రానికి ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు ప్రొద్దుటూరు నుండి కన్యతీర్థములకు ఉదయం 9 గంటలకు కొలతలకు ఉదయం ఏడు గంటలకు బస్సులు బయలుదేరునని తెలిపారు మరియు ప్రతి శని ఆది సోమవారాలలో ఉదయం ఏడున్నర గంటలకు శ్రీశైలం అన్నకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా డిపో మేనేజర్ కోరారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక

డయల్ 100తో పోలీసులు తక్షణ స్పందనతో సహాయం

● రామాపురం ఎస్ఐ శివకుమార్



రామాపురం మన జనప్రగతి నవంబర్ 09:-కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని రామాపురం ఎస్సై శివకుమార్ తన సిబ్బందితో సకాలంలో స్పందించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. రామాపురం పోలీసుల కథనం ప్రకారంరామాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిట్లూరు గ్రామం ఏకిలపల్లె చెందిన ఎస్. వాణిత తన భర్త సిద్ధం సునీల్‌కుమార్ మధ్య మనస్పర్థలు తలెత్తడంతో ఆయన ఆత్మహత్యకు ఆదివారం ప్రయత్నిస్తున్నట్లు డయల్ 100కు సమాచారం అందించారు.వెంటనే స్పందించిన రామాపురం ఎస్ఐ శివకుమార్ తన పోలీసు బృందంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్న సునీల్‌కుమార్ ఆచూకీ గుర్తించి, ధైర్యం చేసుకుని ఆయన ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. అనంతరం ఆయనకు కౌన్సెలింగ్ నిర్వహించి, ఆత్మహత్య ఆలోచనల నుంచి బయటపడేలా అవగాహన కల్పించారు.పోలీసుల సమయస్ఫూర్తి, తక్షణ స్పందనతో ఒక ప్రాణం కాపాడబడటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.**ఆపదలో డయల్ 100 లేదా 112కు ఫోన్ చేయండి** ఎవరైనా ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసినా,ఆపదలో ఉన్నా వెంటనే డయల్ 100 లేదా 112కు సమాచారం అందించాలని రామాపురం ఎస్సై శివకుమార్ పోలీసులు సూచించారు. సకాలంలో చేసే ఒక్క ఫోన్ కాల్ ఒక నిండు ప్రాణాన్ని కాపాడగలదని రామాపురం ఎస్సై శివ కుమార్ పేర్కొన్నారు.

ధనిక పేద తేడా లేకుండా అందరికీ సమ న్యాయం అందించడమే లక్ష్యం

● ఎమ్మిగనూరులో ఘనంగా జాతీయ న్యాయ సేవల దినోత్సవం



ఎమ్మిగనూరు మన జనప్రగతి నవంబర్ 09:-న్యాయం కోసం న్యాయస్థానానికి వచ్చే ధనికా,పేద అని తారతమ్యం లేకుండా వారికి న్యాయ సేవలు అందించడమే న్యాయశాఖ ముఖ్య లక్షమని ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి పి.హేమ అన్నారు. సోమవారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా న్యాయవాదులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ న్యాయవ్యవస్థపై పూర్తిస్థాయిలో అవగాహనలు కలిగి ఉండాలని జడ్జి సూచించారు.అలాగే జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలికల కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు చట్టాలు,వాటి యొక్క ప్రాముఖ్యతలపై వివరించారు. విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరు చట్టాలు తెలుసుకొని తమకు తెలిసిన విషయాలను ఇతరులకు తెలియజేయాలని న్యాయవాదులు కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రసీదుల్లా, లింగమూర్తి,మురళీకృష్ణ,లోక్ అదాలత్ క్లర్క్ రమాదేవి,ఇతర న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చేరువకు న్యాయ సేవలు అందిద్దాం

- ఘనంగా జాతీయ న్యాయ సేవల దినోత్సవం



ఆదోని మన జనప్రగతి నవంబర్ 09:-సమాజంలో ప్రతి ఒకరికి న్యాయ సేవలు అందించడమే లక్ష్యంగా న్యాయవ్యవస్థ ముందుకు సాగుతుందని ఆదోని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అర్చన అన్నారు. సోమవారం కర్నూలు జిల్లా ఆదోనిలో జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా ఆదోని బీసీ హాస్టల్లో మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేసి చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైబర్ నేరాలు ఫోక్సో చట్టాలు, విద్యార్థుల హక్కులు తదితర చట్టాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాజేంద్రప్రసాద్, లోకేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సేవలపై అవగాహన ర్యాలీ

- బసవతారక లా కాలేజ్ ఆధ్యాపకులు, విద్యార్థుల చురుకైన భాగస్వామ్యం





కడప, మన జనప్రగతి, నవంబర్ 09:- జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని కడపలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవలపై న్యాయ విజ్ఞాన సదస్సు, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ట్రైనర్ కౌన్సిలర్ బి నాగ మల్లికా ఆధ్వర్యం లో శ్రీమతి బసవతారకం కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ గోపాల్ మాట్లాడుతూ.. ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సహాయం అందించడమే సంస్థ లక్ష్యమని తెలిపారు. ప్రజలకు న్యాయ హక్కులు, ఉచిత న్యాయ సహాయం, సత్వర న్యాయం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో శ్రీమతి బసవతారక లా కాలేజ్ ఆధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి కోటిరెడ్డి సర్కిల్, సంధ్యా సర్కిల్, రాజీవ్ మార్గ్, కలెక్టర్ సుబ్రహ్మణ్యం సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ మీదుగా తిరిగి జిల్లా కోర్టు వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. న్యాయ సేవల కోసం 15100 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్. బాబా ఫక్రుద్దీన్, కడప యూనిట్ న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయ కళాశాల విద్యార్థులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హర హర మహాదేవునికి విశేష పూజలు

● నేటి నుంచి కార్తీక మాస పూజలు ప్రారంభం

● విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబైన మిట్ట మల్లేశ్వర ఆలయం



పులివెందుల అర్బన్ మన జనప్రగతి నవంబర్ 09:పులివెందుల పట్టణ పరిధిలోని ప్రసిద్ధ పురాతన శ్రీ మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారాన్ని పురస్కరించుకుని విశేష పూజలు ఘనంగా నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు రుద్ర,శివ స్వాముల ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామివారికి పంచామృతాభిషేకం, భస్మాభిషేకం,బిల్వార్చన, సహస్రనామార్చన తదితర వైదిక కైంకర్యాలు శాస్త్రోక్తంగా జరిగాయి.అనంతరం మిట్టమల్లేశ్వరుడు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.నేటి నుంచి పవిత్ర కార్తీక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా,రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ కార్తీక మాసంలో శివకేశవులను ఆరాధించడం,తులసి పూజ, దీపారాధన,నదీస్నానాలు, ఉపవాస దీక్షలు ఆచరించడం వల్ల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు,ఐశ్వర్యం చేకూరుతాయని వివరించారు.కార్తీక మాసంలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.ఆలయంలో అభిషేకాలు,నవగ్రహ పూజలు,ఆకు పూజలు తదితర విశేష పూజలు జరిపించుకోదలచిన భక్తులు ప్రధాన అర్చకులు రుద్ర,శివ స్వాములను సంప్రదించాలని కోరారు.పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు సీపీ బ్రౌన్ 228వ జయంత్యుత్సవం

- మీబ్రౌన్ గ్రంథాలయంలో ప్రత్యేక సాహిత్య కార్యక్రమం

కడప, మన జనప్రగతి, నవంబర్ 09:- యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నవంబర్ 10వ తేదీ మంగళవారం ఉదయం 10.30 గంటలకు తెలుగు సూర్యుడు సీపీ బ్రౌన్ 228వ జయంత్యుత్సవాన్ని నిర్వహించనున్నట్లు పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య గంజి పార్వతి తెలిపారు.ఈ కార్యక్రమానికి యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అధ్యక్షత వహించనుండగా, నెల్లూరు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారు. విశ్వవిద్యాలయ రెక్టార్ ఆచార్య ఎ.జి. దాము, కులసచివులు ఆచార్య ఎన్.సి. గంగిరెడ్డి విశిష్ట అతిథులుగా హాజరవుతారు. హైదరాబాద్‌కు చెందిన కవి, నటుడు, గాయకుడు డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ ప్రధాన వక్తగా పాల్గొని 'రాయలసీమ రంగస్థల వైభవం' అనే అంశంపై ప్రసంగించనున్నారు. సాహితీ ప్రియులు, భాషాభిమానులు, సాహితీవేత్తలు, ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని నిర్వాహకులు ఆహ్వానించారు.

రాయలసీమ అస్తిత్వ ఉద్యమ యోధుడు పప్పూరు రామాచార్యులు

- సీపీ బ్రౌన్ పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య గంజి పార్వతి



కడప, మన జనప్రగతి, నవంబర్ 09:- రాయలసీమ ప్రజల స్థితిగతులు, ఆకాంక్షలు, హక్కులను 'శ్రీసాధన' పత్రిక ద్వారా ప్రపంచానికి చాటిచెప్పిన అస్తిత్వ ఉద్యమ యోధుడు పప్పూరు రామాచార్యులు అని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య గంజి పార్వతి పేర్కొన్నారు.యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం పప్పూరు రామాచార్యుల 131వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆచార్య గంజి పార్వతి మాట్లాడుతూ పప్పూరు రామాచార్యులు స్వాతంత్ర్యోద్యమం, గ్రంథాలయోద్యమం, పత్రికారంగాల్లో విశేష సేవలందించారని తెలిపారు. 1922లో 'పినాకిని', 1926లో 'శ్రీసాధన' పత్రికలను ప్రారంభించి జాతీయోద్యమ ప్రచారానికి, విద్యా విజ్ఞాన వ్యాప్తికి, రాయలసీమ సమస్యలపై ప్రజల్లో చైతన్యానికి కృషి చేశారని వివరించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, రచయితగా, సంపాదకుడిగా, సంఘసంస్కర్తగా బహుముఖ సేవలందించారని పేర్కొన్నారు.సహాయ పరిశోధకులు డా. భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ.. 'వదరుబోతు' వ్యాసాల ద్వారా సామాజిక దురాచారాలను ఖండించారని, రాయలసీమ అభివృద్ధికి శ్రీభాగ్ ఒప్పందంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. మరో సహాయ పరిశోధకులు డా. చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ.. సాహిత్యం, సామాజిక విలువలు, యాత్రా రచనల ద్వారా ప్రజలకు ఎన్నో విషయాలను అందించారని వివరించారు.ఈ కార్యక్రమంలో రచయిత కొత్తపల్లె రామాంజనేయులు, జూనియర్ అసిస్టెంట్ ఆర్. వెంకటరమణ, పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

కార్తీక మాసంలో ప్రతిరోజూ ఆకాశదీపం

● శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమం

● భక్తులకు పండితుల ఆహ్వానం



పులివెందుల టౌన్ మన జనప్రగతి 09:-కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పులివెందుల పట్టణంలోని శ్రీ రంగనాథ స్వామి దేవస్థానంలో ప్రతిరోజూ ఆకాశదీపం వెలిగించే కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు ఆలయ పండితులు నవీన్ శర్మ తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా ఆధ్యాత్మిక సంప్రదాయంలో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఆకాశదీపాన్ని వెలిగించ నున్నట్లు వెల్లడించారు.కార్తీక మా సంలో ప్రతిరోజూ ఆకాశదీపం వెలిగించడం వల్ల ఈ ప్రాంతమంతా సుభిక్షంగా ఉండటంతో పాటు ప్రజలకు శుభం కలుగుతుందని పండితులు పేర్కొన్నారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పట్టణ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.ప్రతిరోజూ సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 గంటల లోపు ఆకాశదీపం వెలిగించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాము లై విజయవం తం చేయాలని నవీన్ శర్మ పిలుపునిచ్చారు.

భార్యాబిడ్డల హత్య కేసు నిందితుడు ఆత్మహత్య



తొండూరు మన జనప్రగతి నవంబర్ 09:-భార్య, కుమార్తెను హత్య చేసిన కేసులో శిక్ష అనుభవించి ఇటీవల ఇంటికి చేరిన గంగాధర్ రెడ్డి ఉరివేసుకుని మృతి చెందాడు.గత ఏడాది జనవరి 7న భార్య, కుమార్తెను హత్య చేసిన కేసులో శిక్ష అనుభవించిన ఆయన, రెండు రోజుల క్రితం ఇంట్లో ఉరివేసు కుని మృతి చెందినట్లు తెలుస్తోంది.ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై శివనాగిరెడ్డి సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని తలుపులు తెరిచి చూడగా గంగాధర్ రెడ్డి మృతదేహం ఉరికి వేలాడుతూ కనిపించింది.అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు.ఘటనపై పోలీసులు విచారణ చేపట్టి మృతికి గల కారణాలను ఆరా తీస్తున్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు పుస్తకాల విరాళం





- ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి అకాడమిక్, పోటీ పరీక్షల పుస్తకాల అందజేత

పరకాల, మన జనప్రగతి నవంబర్ 09: విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పరకాల పట్టణానికి చెందిన తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పరకాల గ్రంథాలయానికి అకాడమిక్, కాంపిటీటివ్ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకొని రానున్న సెమిస్టర్ పరీక్షలతో పాటు వివిధ పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ పుస్తకాలు ప్రస్తుత విద్యార్థులకే కాకుండా భవిష్యత్ తరాలకు కూడా ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లయ్య మాట్లాడుతూ.. విద్యాదానం అన్నింటికంటే గొప్పదని, కళాశాల గ్రంథాలయ అభివృద్ధికి సహకారం అందించిన తమ్మిశెట్టి వెంకటేశ్వర్లును ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ సమక్షంలో గ్రంథపాలకుడు డాక్టర్ జి. రాజేశ్వర్ కుమార్‌కు పుస్తకాలను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ అలిశాల అశోక్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి. రామకృష్ణ, డాక్టర్ బి. విజయపాల్ రెడ్డి, డాక్టర్ టి. కల్పన, డాక్టర్ టి. భీమ్ రావు, డాక్టర్ కె. జగదీష్ బాబు, ఆర్. ఈశ్వరయ్య, ఎస్. రాజశ్రీ, డాక్టర్ డి. సంజయ్ కుమార్, అలేఖ్య, సతీష్, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం భరోసా!

● హార్యాతండాలో నూతన గృహ ప్రవేశాలతో లబ్ధిదారుల కుటుంబాల్లో వెల్లివిరిసిన ఆనందం



రఘునాథపాలెం, మన జనప్రగతి నవంబర్ 09: ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేరాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోంది. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ఈ పథకం కొండంత భరోసాగా నిలుస్తోంది. రఘునాథపాలెం మండలం హార్యాతండా గ్రామానికి చెందిన భూక్యా రమేష్, లక్ష్మి దంపతుల కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కల సాకారం కావడంతో వారి కుటుంబంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. నూతన గృహంలో గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారుల కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. సొంత ఇల్లు కేవలం నివాసం మాత్రమే కాదని, అది ఒక కుటుంబానికి ఆత్మగౌరవం, భద్రత, భవిష్యత్తుపై నమ్మకాన్ని కల్పిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బానోతు శ్రీను నాయక్, మాజీ మండల అధ్యక్షులు దిప్లా నాయక్, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు బోడెపూడి రాజా, జీపీ సెక్రటరీ బోడా రాము, వార్డు సభ్యులు చందర్, శివలాల్, సౌందర్య, శాంత, కృష్ణ, గ్రామ అధ్యక్షులు మోహన్, ఉపాధ్యక్షులు ప్రేమ్ కుమార్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, మంగిని, మంగీలాల్, మోహన్ చందర్ తదితరులు పాల్గొన్నారు. నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను నిజం చేస్తూ వారి జీవితాల్లో సంతోషాన్ని నింపుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల సంక్షేమానికి బలమైన భరోసాగా నిలుస్తోందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

గద్దర్ పాటకు నిలువెత్తు రూపం.. జమ్మికుంటలో విగ్రహ ప్రతిష్ఠాపనకు శ్రీకారం!

ప్రజా యుద్ధనౌక ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి కావాలి..

ఐక్యంగా ముందుకు సాగుదాం


సన్నాహక సమావేశంలో వక్తల పిలుపు



జమ్మికుంట,మన జనప్రగతి నవంబర్ 09: ప్రజా గాయకుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ ఆశయాలను భావితరాలకు అందించాలనే సంకల్పంతో జమ్మికుంటలో ఆయన విగ్రహ ప్రతిష్ఠాపనకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళా మండలి ఆధ్వర్యంలో ఆదివారం జమ్మికుంటలోని సహచర పిల్లల హాస్పిటల్ రెండో అంతస్తులో సన్నాహక సమావేశం నిర్వహించారు. ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి వ్యవస్థాపక అధ్యక్షులు రామంచ భరత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గద్దర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. విగ్రహ స్థాపనకు అనువైన స్థలం ఎంపిక, అవసరమైన ఏర్పాట్లు, తదుపరి కార్యాచరణపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యులు మాట్లాడుతూ.. గద్దర్ కేవలం ప్రజా గాయకుడే కాకుండా అణగారిన వర్గాల గొంతుకగా, సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు. తన ఆటపాటలతో ప్రజల్లో చైతన్యం నింపుతూ, పేదలు, కార్మికులు, బడుగు బలహీన వర్గాల సమస్యలను సమాజం దృష్టికి తీసుకెళ్లారని గుర్తుచేశారు. ప్రజల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గద్దర్ సేవలను, ఆయన పోరాట స్ఫూర్తిని భావితరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జమ్మికుంటలో గద్దర్ విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టడం ద్వారా ఆయన ఆశయాలు, ప్రజా పోరాట స్ఫూర్తిని చిరస్థాయిగా నిలిపే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజా సంఘాలు, కళాకారులు, సాహిత్య అభిమానులు, ప్రజాస్వామిక వాదులు, గద్దర్ అభిమానులు పార్టీలకతీతంగా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య, తెలంగాణ వర్కర్స్ హమాలి యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు గుంటి సామ్రాజ్యం, బీఎస్పీ హుజురాబాద్ నియోజకవర్గ నాయకులు అంబాల ప్రభాకర్ (ప్రభు), డీటీఎఫ్ నాయకులు ఆవాల నరహరి, వేణు, బీసీ సంఘం నాయకులు దెబ్బట రవీందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వాసాల రామస్వామి, టీఆర్ఎస్ నాయకురాలు ఆకినపల్లి శిరీష ప్రవీణ్, వల్లభాపూర్ సర్పంచ్ అందె కుమార్, ద్రావిడ సాహిత్య సాంస్కృతిక కళామండలి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మారముల్ల ఆనందం, కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్ గొల్లపల్లి శ్రీకాంత్, చల్లూరు మాజీ ఎంపీటీసీ, ప్రముఖ కళాకారుడు తాండ్ర శంకర్, ప్రముఖ గాయకులు మిట్టపల్లి బాలు, మంద జగన్, దాసరపు సమ్మయ్య, దాసరపు రాజు, కాశి, శివకుమార్, సంపత్ కుమార్, పల్లవి స్టూడియో అధినేత మారముల్ల ప్రభు, కాంగ్రెస్ నాయకులు మారేపల్లి అజయ్, జర్నలిస్టులు కుమార్ యాదవ్, మహమ్మద్ నజీరుద్దీన్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఆర్.జె.సి. కృష్ణకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు..

- ఆయురారోగ్యాలతో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్ష



ఖమ్మం ప్రతినిధి మన జనప్రగతి నవంబర్ 09: బీఆర్ఎస్ పార్టీ నాయకులు, 3వ టౌన్ ఇంచార్జ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, ఎస్‌బీఐటీ విద్యాసంస్థల అధినేత ఆర్.జె.సి. కృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు రాజకీయ, సామాజిక రంగాల ప్రముఖులు ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా 48వ డివిజన్ మాజీ కార్పొరేటర్ తోట రామారావు ఆధ్వర్యంలో నాయకులు, మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు కృష్ణను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తోట రామారావు మాట్లాడుతూ విద్యారంగంలో ఎస్‌బీఐటీ విద్యాసంస్థల ద్వారా ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తూ, రాజకీయంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ తనదైన గుర్తింపు సంపాదించుకున్న ఆర్.జె.సి. కృష్ణ మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజలకు, సమాజానికి మరిన్ని సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 48వ డివిజన్ మాజీ కార్పొరేటర్ తోట రామారావు, డివిజన్ మున్నూరుకాపు సంఘ యువజన అధ్యక్షుడు తోట రమేష్, డివిజన్ మాజీ అధ్యక్షుడు చేతి కృష్ణ, డివిజన్ బాధ్యులు కిషన్ నాయక్, మున్నూరుకాపు సంఘ సభ్యులు రాకం శ్యామ్, శాభాసు రమణ, నిమ్మల నవీన్, ఆకుల సత్యం తదితరులు పాల్గొని ఆర్.జె.సి. కృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆపదలో పెద్దశేషయ్య కుటుంబానికి అండగా సీతారాములు

- రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేత.. మానవత్వాన్ని చాటుకున్న హమాలీ సంఘం ప్రధాన కార్యదర్శి



కల్లూరు, మన జనప్రగతి నవంబర్ 09: ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని నిరూపిస్తూ హమాలీ సంఘం ప్రధాన కార్యదర్శి నల్లగట్ల సీతారాములు తన ఉదారతను చాటుకున్నారు. కల్లూరు పట్టణానికి చెందిన మాతిపోగు పెద్దశేషయ్య (పెద్దబ్బాయి) మృతి చెందడంతో తీవ్ర విషాదంలో ఉన్న ఆయన కుటుంబానికి రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేసి భరోసా కల్పించారు. ఆపద సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం ద్వారా సమాజంలో మానవీయ విలువలు, పరస్పర సహకారం ఎంత ముఖ్యమో చాటిచెప్పారు. మాతిపోగు పెద్దశేషయ్య మృతి వార్తతో తీవ్రంగా చలించిన నల్లగట్ల సీతారాములు, బాధిత కుటుంబాన్ని పరామర్శించి తన సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెద్దశేషయ్య సతీమణి సంతోషం, వారి కుమారులు శ్రీను, వెంకటేశ్వర్లు సమక్షంలో రూ. 10 వేలు నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, కష్టకాలంలో తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం పెద్దశేషయ్యతో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని, గతంలో కలిసి గడిపిన మధుర జ్ఞాపకాలను నల్లగట్ల సీతారాములు గుర్తుచేసుకున్నారు. ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పెద్దశేషయ్య మృతి తనకు తీరని లోటు అని, ఆయనతో ఉన్న అనుబంధం ఎప్పటికీ మరువలేనిదని పేర్కొన్నారు. కేవలం ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, దుఃఖంలో ఉన్న కుటుంబానికి మానసిక ధైర్యాన్ని అందించడం సీతారాములు సేవాభావానికి నిదర్శనంగా నిలిచింది. సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా ఆపదలో ఉన్నవారికి సహాయం చేయాలని ఆయన చాటిచెప్పారు. సంపాదనలో కొంత భాగాన్ని అవసరమైన వారికి అందించడం ద్వారా వారి జీవితాల్లో ఆశాకిరణాన్ని నింపవచ్చనే సందేశాన్ని ఈ సేవా కార్యక్రమం అందించింది. ఈ కార్య క్రమంలో మాజీ వార్డు సభ్యులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు (నెంబర్ వెంకట్) మున్సిపల్ కౌన్సిలర్ ఖమ్మంపాటి రాధా వీరస్వామి, కె.వి., మోదుగు రమేష్, మాతిపోగు ఆనంద్, మాతిపోగు రాము, మాతిపోగు రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఆపదలో ఆపన్నహస్తం అందించి, దుఃఖంలో ఉన్న కుటుంబానికి ధైర్యాన్ని కల్పించిన నల్లగట్ల సీతారాములు మానవీయ దృక్పథం పలువురి ప్రశంసలు అందుకుంది.

వలస తెలంగాణ ప్రజల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి

● ముంబై, సూరత్, భివండి, నవీముంబై ఉద్యమకారుల విజ్ఞప్తి

● ఈ నెల 13న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశం



జవహర్ నగర్,మన జనప్రగతి నవంబర్ 09: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వలస తెలంగాణ ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ముంబై తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎంటీజేఏసీ) ప్రతినిధులు కోరారు. ఆదివారం ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాముకు కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ముంబై, భివండి, నవీముంబై, సూరత్ ప్రాంతాల్లో నివసిస్తున్న తెలంగాణ కార్మికులు ఉపాధి, నివాసం, విద్య, వైద్యం, ఆరోగ్య భద్రత, పెన్షన్ల వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వలస కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ విధానం రూపొందించి, అర్హులైన ఉద్యమకారులకు గుర్తింపు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇతర రాష్ట్రాల్లోని తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని కోరారు. వారి విజ్ఞప్తిపై ప్రొఫెసర్ కోదండరాము సానుకూలంగా స్పందించి, సమస్యలను కేకే కమిటీ దృష్టికి తీసుకెళ్లేందుకు సహకరిస్తామని తెలిపినట్లు ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ నెల 13న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వలస తెలంగాణ ఉద్యమకారులు, సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ముంబై, సూరత్, భివండి, నవీముంబై తదితర ప్రాంతాల ప్రతినిధులు హాజరుకావాలని ఎంటీజేఏసీ నాయకులు పిలుపునిచ్చారు.

మహిళా సమాఖ్య భవనం, వ్యవసాయ గోదాం ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్







వేములవాడ, మన జనప్రగతి నవంబర్ 09: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య సంఘం భవనాన్ని, మారుపాక గ్రామంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ గోదాంను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, మహిళా సంఘాల బలోపేతానికి, రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. మహిళా సమాఖ్య భవనం మహిళా సంఘాల కార్యకలాపాలకు ఉపయోగపడనుండగా, వ్యవసాయ గోదాం రైతులకు పంటల నిల్వలో ఎంతగానో తోడ్పడనుంది.

చెరువులో దూకి యువకుడు ఆత్మహత్య



సత్తుపల్లి, మన జనప్రగతి నవంబర్ 09: సత్తుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రామనగరం గ్రామ శివారులో ఉన్న బెతుపల్లి చెరువులోని కలంగి ప్రాంతంలో కడెం మనోజ్ అనే యువకుని మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలం, సీతారాంపురం గ్రామానికి చెందిన కడెం సురేష్ కుమారుడు కడెం మనోజ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా తనకు ట్రాక్టర్ కొనివ్వాలని తండ్రిని కోరుతున్నాడు. అయితే ప్రస్తుతం ఆర్థిక పరిస్థితుల కారణంగా ట్రాక్టర్ కొనివ్వలేకపోయిన తండ్రి, వచ్చే సంవత్సరం కొనిస్తానని కుమారుడికి చెప్పాడు. ఈ క్రమంలో 6 నవంబర్ 2026వ తేదీ సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో మనోజ్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లు, స్నేహితుల వద్ద, పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఈ విషయమై అతని తండ్రి దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కింద మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం సుమారు 9 గంటలకు వుకే శివ అనే వ్యక్తి ఫోన్ చేసి, మనోజ్ మృతదేహం బెతుపల్లి చెరువులో ఉన్నట్లు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. ట్రాక్టర్ కొనివ్వలేదనే మనస్తాపంతో మనోజ్ జీవితంపై విరక్తి చెంది బెతుపల్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని ఫిర్యాదుదారు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కుమారుడి మృతిపై తమకు గానీ, తమ కుటుంబ సభ్యులకు గానీ ఎలాంటి అనుమానాలు లేవని మృతుడి తండ్రి పోలీసులకు తెలిపారు. ఈ ఘటనపై కడెం సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినైనది అని సత్తుపల్లి సిఐ తుమ్మలపల్లి శ్రీహరి తెలియచేశారు.

దర్గా మురుగునీటి సమస్య పరిష్కారానికి కృషి

- జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా: మహమ్మద్ తాజుద్దీన్





కరీంనగర్, మన జనప్రగతి నవంబర్ 09: షేక్ మొయినుద్దీన్ దర్గాలో నెలకొన్న మురుగునీటి సమస్యపై జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ చైర్మన్ మహమ్మద్ తాజుద్దీన్ నేతృత్వంలోని నాయకుల బృందం ఆరా తీసింది. సర్పంచ్ అంజన, ఉపసర్పంచ్ కుమార్‌తో మాట్లాడి సమస్య వివరాలు తెలుసుకున్నారు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తాజుద్దీన్ తెలిపారు. దర్గాకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మైనారిటీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి: అధికారులకు అదనపు కలెక్టర్లు ఆదేశం



ములుగు, మన జనప్రగతి నవంబర్ 09: ప్రజావాణిలో అందిన వినతులను నిబంధనల ప్రకారం పరిశీలించి, పరిష్కార చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, ఎం. సంపత్ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి మొత్తం 19 అర్జీలు స్వీకరించారు. వీటిలో భూ సమస్యలపై 10, ఇందిరమ్మ ఇళ్లపై 2, పింఛన్లపై 2, ఉద్యోగానికి సంబంధించి ఒకటి, ఇతర సమస్యలపై 4 అర్జీలు వచ్చాయి. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

ఎన్ఎల్ఎం పథకం అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి

- 40 ప్రాజెక్టుల్లో నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఏఐఎఫ్‌బీ ఫిర్యాదు



కరీంనగర్, మన జనప్రగతి నవంబర్ 09: జిల్లాలో నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (ఎన్ఎల్ఎం) పథకం అమలులో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, కమిటీ సభ్యుడు బద్రి సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.జిల్లాలో సుమారు 40 ప్రాజెక్టులకు కేటాయించిన ప్రభుత్వ సబ్సిడీ, బ్యాంకు రుణాల వినియోగంలో అవకతవకలు జరిగినట్లు అనుమానాలు ఉన్నాయని శేఖర్ తెలిపారు. నిర్మాణాలు చేపట్టకుండానే షెడ్లు ఉన్నట్లు చూపించడం, పాత షెడ్లను కొత్తవిగా పేర్కొనడం, పశువులు, కోళ్లు లేకున్నా ఉన్నట్లు తప్పుడు నివేదికలు సమర్పించారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు.పశుసంవర్ధక శాఖ, బ్యాంకు అధికారుల పాత్రపై విచారణ జరిపి, ప్రాజెక్టుల క్షేత్రస్థాయి తనిఖీలు, నిధుల వినియోగంపై ఆడిట్ నిర్వహించాలని కోరారు. అక్రమాలు నిర్ధారణ అయితే నిధులను రికవరీ చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బండారి శేఖర్ డిమాండ్ చేశారు.

రైతన్న కన్నీటికి పరిష్కారం దిశగా ఐక్య పోరాటం!

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్
- రైతుల హక్కుల సాధనే లక్ష్యంగా ఏఐకేఎస్ జాతీయ మహాసభలు
- నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో జాతీయ మహాసభలు..
- 15న భారీ రైతు బహిరంగసభ



ఖమ్మం ప్రతినిధి, మన జనప్రగతి నవంబర్ 09: దేశానికి అన్నం పెట్టే అన్నదాతల కష్టాలు తీరాలంటే వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా ఐక్య ఉద్యమాలు సాగాలని అఖిల భారత రైతు సంఘం (ఏఐకేఎస్) నాయకులు పిలుపునిచ్చారు. రైతుల హక్కుల పరిరక్షణ, వ్యవసాయ కార్మికుల సంక్షేమం, రైతు కూలీల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించనున్న జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ కోరారు. నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు నల్లగొండలో నిర్వహించనున్న ఏఐకేఎస్ జాతీయ మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న పోతినేని సుదర్శన్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక, పెట్టుబడి భారంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్న అన్నదాతలకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, రైతు కుటుంబాల్లో వెలుగులు నిండినప్పుడే గ్రామీణ భారతం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు.రైతుల హక్కుల సాధన, వ్యవసాయ రంగ పరిరక్షణ, వ్యవసాయ కార్మికులకు మెరుగైన జీవన పరిస్థితులు, రైతు కూలీల సంక్షేమం వంటి కీలక అంశాలపై జాతీయ మహాసభల్లో విస్తృతంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. రైతు కష్టానికి తగిన ప్రతిఫలం, వ్యవసాయానికి ప్రభుత్వ అండ, కూలీలకు గౌరవప్రదమైన జీవన భద్రత కల్పించేందుకు సంఘటిత పోరాటం అవసరమని స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో నవంబర్ 15న నిర్వహించనున్న రైతు బహిరంగ సభకు రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు యం. సుబ్బారావు, కళ్యాణ వెంకటేశ్వరరావు, తుమ్మ విష్ణువర్ధన్, వాసిరెడ్డి ప్రసాద్, ఎస్.కె. మీరా, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, పడగల నాగేశ్వరరావు, నామా లక్ష్మీనారాయణ, రెడపంగి ప్రకాష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మధు, వెంకయ్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు

- సొంతింటి కల సాకారంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందోత్సాహాలు
- ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఖమ్మం అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగళ్ల దీపక్ చౌదరి, ఖమ్మం జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎం.డి ఖాదర్ బాబా





ఖమ్మం ప్రతినిధి, మన జనప్రగతి నవంబర్ 09: పేదవాడి జీవితంలో సొంతిల్లు అనేది కేవలం నాలుగు గోడల నిర్మాణం కాదు.. అది భద్రతకు భరోసా, కుటుంబానికి ఆత్మగౌరవం, పిల్లల భవిష్యత్తుకు పునాది. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాల కలలను సాకారం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం వారి జీవితాల్లో కొత్త ఆశలను చిగురింపజేస్తోంది. దీపావళి పండుగ వేళ నూతన గృహాల్లో అడుగుపెడుతున్న లబ్ధిదారుల కుటుంబాల ఆనందం రెట్టింపవుతూ, వారి ఇళ్లలో పండుగ వెలుగులు విరజిమ్ముతున్నాయి.ఖమ్మం నగరంలోని 48వ డివిజన్ దానవాయిగూడెం పార్క్ సమీపంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఖమ్మం అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగళ్ల దీపక్ చౌదరి, ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి. ఖాదర్ బాబా ముఖ్య అతిథులుగా హాజరై గృహప్రవేశ కార్యక్రమాలను ప్రారంభించారు. 48వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు అల్లె సాయికిరణ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి.ఈ సందర్భంగా నాగళ్ల దీపక్ చౌదరి, ఎం.డి. ఖాదర్ బాబా మాట్లాడుతూ.. పేద ప్రజలకు కనీస అవసరమైన నివాస గృహాన్ని అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో స్థానిక జిల్లా మంత్రుల పటిష్టమైన ప్రణాళికలు, ప్రత్యేక చొరవతో అర్హులైన నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.ఒకప్పుడు అద్దె ఇళ్లలోనో, ఇరుకైన గదుల్లోనో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనం సాగించిన పేద కుటుంబాలకు సొంతింటి చిరునామా లభించడం ఎంతో గొప్ప విషయమన్నారు. తలదాచుకోవడానికి ఒక గూడు కల్పించడం ద్వారా పేద కుటుంబాలకు ప్రభుత్వం ఆత్మవిశ్వాసాన్ని, భద్రతను అందిస్తోందని అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా కొత్త ఇంటి గుమ్మంలో దీపాలు వెలిగిస్తూ, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతున్న లబ్ధిదారులను చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.పేదల కళ్లలో ఆనందం, వారి కుటుంబాల్లో చిరునవ్వులు వెల్లివిరి యడమే ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అసలైన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి గౌరవ ప్రదమైన నివాసం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ దీపావళి ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయు రారోగ్యాలు, సిరిసం పదలు నింపాలని ఆకాంక్షిస్తూ ఖమ్మం జిల్లా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నగర నాయకులు బాణాల లక్ష్మణ్, ఖమ్మం కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి బోజడ్ల సత్యనారాయణ, డివిజన్ నాయకులు కోయ బాలాజీ, వార శివ, సారంగపాణి, బుడిగ వెంకన్న, రాహుల్, రామకృష్ణ, సతీష్, దాసు, వంశీ, హరీష్, జహీర్, ఉపేందర్, కిషోర్, అరుణ్, వెంకటేష్, సైదులుతో పాటు 48వ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం అభ్యర్థనను ప్రజలు ఆదరించారు

● అపరిస్కృత సమస్యలను పరిష్కరిస్తాం,అందరి మన్ననలు పొందుతాం ● పులివెందుల నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి



పులివెందుల అర్బన్ మన జనప్రగతి నవంబర్ 09: పులివెందుల అభివృద్ధి కోసం ఒక అవకాశం అభ్యర్థనను ప్రజలు ఆదరించారని,ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అపరిస్కృత సమస్యలను పరిష్కరించి అందరి మన్ననలు పొందుతామని పులివెందుల టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి పేర్కొన్నారు. పులివెందుల మున్సిపాలిటీ ఎన్నికలతో పాటు జడ్పీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి మద్దతు తెలిపి విజయాన్ని అందించిన నియోజకవర్గ ప్రజలకు,పార్టీ కార్యకర్తలకు బీటెక్ రవి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు.ఒక్క అవకాశం ఇవ్వాలని కోరిన తమకు పులివెందుల ప్రజలు ఆదరణ చూపించారని,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి వార్డులో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తామని బీటెక్ రవి తెలిపారు.వైఎస్సార్సీపీకి కంచుకోటగా భావించే లింగాల మండలంలో సైతం తెలుగుదేశం పార్టీకి ప్రజలు అండగా నిలిచి విజయాన్ని అందించడం సంతోషకరమన్నారు. ఎర్రబల్లె చెరువుకు నీరు అందించినందుకు కృతజ్ఞతగా పులివెందుల మండల ప్రజలు కూటమికి మద్దతు తెలిపారని పేర్కొన్నారు.వేంపల్లె జడ్పీటీసీ స్థానంలో పొత్తుల కారణంగా అభ్యర్థి కేటాయింపుపై కొంతమంది కార్యకర్తల్లో నిరాశ ఏర్పడిందని,ఎన్నికల సమయంలో తగినంత సమయం కేటాయించలేకపోవడం వల్లే అక్కడ ఆశించిన ఫలితం రాలేదని వివరించారు.వేముల మండలంలో భారతి సొంత బంధువు పోటీలో ఉన్నప్పటికీ టీడీపీ కార్యకర్తలు గట్టిగా పోరాడారని తెలిపారు. పెద్దజూటూరుకు చెందిన ఓ నాయకుడు సహకరించకపోవడంతో స్వల్ప ఓట్ల తేడాతో ఆ స్థానాన్ని కోల్పోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వైఎస్సార్సీపీ జడ్పీటీసీ స్థానాల్లో కనీసం ఖాతా తెరవలేకపోయిందని, గత ఐదేళ్ల పాలనలో జరిగిన అవకతవకలు,మద్యం విధానంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని బీటెక్ రవి విమర్శించారు.రాబోయే పంచాయతీ ఎన్నికల్లో కూడా కూటమి మద్దతుదారులను గెలిపించాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. గ్రామాల అభివృద్ధి వేగవంతం కావాలంటే ప్రజలు కూటమికి అండగా నిలవాలని కోరారు. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసానికి అనుగుణంగా నిరంతరం ప్రజాసేవలో ఉంటామని బీటెక్ రవి స్పష్టం చేశారు.

ఓటరు జాబితాలో పేరు లేని వారికి మరో అవకాశం

● అర్హులు నమోదు పత్రాలు సమర్పించి ఓటరుగా నమోదు చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, మన జనప్రగతి, నవంబర్ 09:- ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాలో వివిధ కారణాలతో పేరు చేరని అర్హులకు మరో అవకాశం కల్పించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.గైర్హాజరు, నివాసం మారడం, మరణం, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉండటం వంటి కారణాలతో జాబితాలో పేరు లేని వారి వివరాలను పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయతీ, పురపాలక కార్యాలయాల్లో ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత బూత్ స్థాయి అధికారులు నమోదు పత్రాలను అందజేస్తారని, వాట్సాప్, సందేశాల ద్వారా కూడా పంపిస్తారని తెలిపారు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్, ఈసీఐనెట్ యాప్ ద్వారా కూడా పత్రాలు పొందవచ్చన్నారు.నివాసం మారిన వారు అనుబంధం-బి, రాష్ట్రంలోనే మరో ప్రాంతానికి మారిన వారు అనుబంధం-సి ప్రకటనతో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. ఇప్పటికే ఫారం-6 ద్వారా కొత్తగా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసిన వారు మళ్లీ నమోదు పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరు జాబితాలో చోటు కల్పించాలని, నిరాశ్రయులు, అందుబాటులో లేని ఓటర్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. ఒకరి పేరు రెండుసార్లు నమోదు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను నవంబర్ 20లోగా పూర్తి చేసి, 22వ తేదీలోగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు.

అరటి రైతులు ఆధునిక పద్ధతులు అవలంబించాలి



● నాణ్యమైన కాయల ఉత్పత్తిపై ఉద్యాన శాఖ ప్రత్యేక శిక్షణ ● శాస్త్రీయ పద్ధతులతో ఎగుమతులకు అనుకూలమైన కాయల ఉత్పత్తి సాధ్యం ● అరటి పరిశోధనా స్థానం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ శిరీష ● గెల వేసిన తర్వాత ఆకుల సంరక్షణ కీలకం ● ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు పి.రవిచంద్రబాబు ● 50 శాతం రాయితీతో రూ.25,500 వరకు ఆర్థిక సాయం



వేముల మన జనప్రగతి నవంబర్ 09:-అరటి గెలల నాణ్యతను పెంపొందించి, ఎగుమతులకు అనుకూలమైన కాయలను ఉత్పత్తి చేసేందుకు రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని అరటి పరిశోధనా స్థానం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ శిరీష సూచించారు. సోమవారం ఉదయం వేముల, వెల్పుల రైతు సేవా కేంద్రాల పరిధిలోని అరటి రైతులకు మండల వ్యవసాయ అధికారి జి.పి. ఓబులేసుతో కలిసి ఉద్యాన శాఖ అధికారులు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గెలల నాణ్యత పెంపు, తామర పురుగుల నివారణ, పండ్ల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.డాక్టర్ శిరీష మాట్లాడుతూ..అరటి గెలలు వేసిన వెంటనే తామర పురుగుల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కాయలపై గార, మచ్చలు ఏర్పడకుండా తగిన సస్యరక్షణ చర్యలు పాటించాలన్నారు. గెల నాణ్యత, కాయల పరిమాణం పెరిగేందుకు 0:0:50 ఎరువును లీటరు నీటికి ఐదు గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలని వివరించారు. గెలలకు రక్షణ తొడుగులు వేయడం ద్వారా పురుగులు, దుమ్ము, ఇతర బాహ్య ప్రభావాల నుంచి కాయలను కాపాడుకోవచ్చని తెలిపారు.ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు పి. రవిచంద్రబాబు మాట్లాడుతూ.. అరటి గెలలు నాణ్యంగా ఎదగాలంటే పండ్ల యాజమాన్య పద్ధతులను తప్పనిసరిగా పాటించాలన్నారు. గెల వేసిన తర్వాత మొక్కపై కనీసం 12 ఆరోగ్యకరమైన ఆకులు ఉండేలా చూసుకోవాలని సూచించారు. గెలలకు రక్షణ తొడుగులు వేయడం, మొగ్గ నిర్వహణ వంటి పద్ధతులను అనుసరించడం ద్వారా కాయల నాణ్యతను మెరుగుపరచుకోవచ్చని పేర్కొన్నారు. **50 శాతం రాయితీతో రూ.25,500 వరకు సాయం** అరటి రైతులను ప్రోత్సహించేందుకు గెలలకు మొగ్గ ఇంజక్షన్లు, రక్షణ తొడుగుల ఏర్పాటుకు ఉద్యాన శాఖ ద్వారా 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు రవిచంద్రబాబు వెల్లడించారు. ఈ పథకం కింద అర్హులైన రైతులు గరిష్ఠంగా రూ.25,500 వరకు ఆర్థిక సహాయం పొందవచ్చని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన అరటి కాయల ఉత్పత్తికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి దీప, మండల వ్యవసాయ అధికారి జి.పి. ఓబులేసు, గ్రామ ఉద్యాన సహాయకులు, స్థానిక అరటి రైతులు పాల్గొన్నారు.

స్కూట్స్‌లో జిల్లా విద్యార్థికి రాజ్యపురస్కారం

- విద్యార్థి ఎం. నరసింహుడును అభినందించిన కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి




కడప, మన జనప్రగతి, నవంబర్ 09:- స్కూట్స్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో రాజ్యపురస్కారం అందుకున్న కడప జిల్లా చెన్నూరు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం. నరసింహుడును జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అభినందించారు.విజయవాడలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా రాజ్యపురస్కార ధ్రువపత్రం అందుకున్న విద్యార్థి నరసింహుడు, స్కూట్ మాస్టర్ వెంకటసుబ్బయ్య సోమవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చిన్న వయసులోనే క్రమశిక్షణ, సేవాభావం, పట్టుదలతో రాజ్యపురస్కారం సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థి విజయం ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆందోళన

● అటవీశాఖపై ఆరోపణలు ● డిప్యూటీ సిఎంకు ఫిర్యాదు






కాకినాడ మన జనప్రగతి నవంబర్ 09:-అటవీ అధికారులు దళారులతో కుమ్మక్కై తమ పొట్ట కొడుతున్నారని ఆరోపిస్తూ మత్స్యకారులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. సోమవారం కరప మండలం ఉప్పలంక సన్నబ్రిడ్జి వద్ద వందమంది పైగా మత్స్యకారులు ఆందోళన చేపట్టారు.తాత,ముత్తాతల కాలం నుంచి తాము నత్తగుల్ల వేటాడి జీవనం సాగిస్తున్నామని అయితే అటవీశాఖ కోరంగి అధికారులు దళారుల కోసం తాము చెప్పిన వారికే వీటిని విక్రయించాలి అని పరోక్షంగా బెదిరిస్తూ నత్తగుల్ల వేట నిషేధమని తమపై కేసులు పెడుతున్నారని వాపోయారు.సోమవారం 20 బోట్లతో తాము వేటకు వెళితే సముద్రం మధ్యలో తమను నిలిపివేసారని, ఈ సమయంలో బోట్లలో డీజిల్ అయిపోతే తమ ప్రాణాలు పోతాయని ఎవరు జవాబుదారి అని ప్రశ్నించారు.కేవలం దళారుల కోసమే కోరంగి అటవీ శాఖ ఈ విధంగా ఈ విధంగా వ్యవహరిస్తోందని బొమ్మిడి సతీష్ ఆధ్వర్యంలో మత్స్యకారులు ధర్నా చేశారు.జిల్లాకు చెందిన పిఠాపురం ఎమ్మెల్యే, అటవీ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ విషయంపై సీఎం, డిప్యూటీ సీఎం, ఎస్పీ, కలెక్టర్ లకు ఫిర్యాదు పంపిస్తున్నట్లు తెలిపారు. తమకు వేట ఆధారమని, గంగమ్మను నమ్ముకుని బతుకుతున్నామని కొందరి స్వార్థం కోసం తమను ఎలా బలిస్తారని సతీష్ ప్రశ్నించారు. తమకు న్యాయం జరగక పోతే ఆత్మహత్యలకు పాల్పడతామని హెచ్చరించారు. బోట్లు నిలిపివేసి ధర్నా చేశారు.

పదవి అలంకారం కాదు.. గురుతర బాధ్యత: మంత్రి కందుల దుర్గేష్

- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



నిడదవోలు, మన జనప్రగతి, నవంబర్ 09:- స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజాసేవే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ సూచించారు.నిడదవోలు నియోజకవర్గంలోని ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలు మండలాల్లో విజయం సాధించిన కూటమి అభ్యర్థులు సోమవారం నిడదవోలులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారికి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు.మంత్రి మాట్లాడుతూ.. పదవి అనేది అలంకారం కాదని, ప్రజలు అప్పగించిన గురుతర బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రజాపాలన సాగించాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు విజయాన్ని అందించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో విజయం సాధించిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174